



# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం 17, డిసెంబర్, 2025




- సొంత పార్టీ వారు పోటీకి పనికిరారట!
- పక్క పార్టీ వారికి పెద్దపీట!
- సిసలైన కాంగ్రెస్ వాదులకు చుక్కెదురు
- వర్గాలను ప్రోత్సహిస్తున్న మాజీ, తాజా ఎమ్మెల్యేలు
- అయోమయంలో కాంగ్రెస్ శ్రేణులు
- విడివిడిగా విజయోత్సాహం

# కాంగ్రెస్కు కరువొచ్చిందా..?

చర్ల, సూర్య (మేజర్‌న్యూస్) - ఎన్నికలలో పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థుల కరువు వచ్చినట్టు ఉన్నదనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. తాతలు,తండ్రుల నాటినుండి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా కాంగ్రెస్ జెండాను వీడని కార్యకర్తలకు నాయకులకు ఎన్నికల సమయంలో చుక్కెదురు అవుతుందని,చర్ల మండలంలో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో ఎంపీటీసీ,జడ్పిటిసి పదవులకు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయడానికి ఆ పార్టీలోనే చాలామంది సీనియర్ నాయకులు ఉండగా కొందరు నాయకులు మాత్రం ఇతర పార్టీల నుండి వలసలను ప్రోత్సహించి వారికి ఎంపీటీసీ టికెట్ ఇచ్చే దిశగా పావులు కలుపుతున్నారని తెలుస్తుంది. ఈ సమాచారం బయటికి పొక్కడంతో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా, జనరల్ వాట్సప్ గ్రూపుల్లో చర్చ మొదలైంది. మొదటి నుండి కాంగ్రెస్ జెండా వదలకుండా ఉన్న వారి పరిస్థితి ఏమిటని కార్యకర్తలు, సీనియర్ నాయకులు ఆవేదన వెలిబుచ్చుతూ పోస్టులు పెడుతున్నారు. 2వ పేజీలో...




## స్థానిక సంస్థల ఎన్నికల్లో... అశ్వారావుపేటలో బీఆర్ఎస్ ఘోర పరాజయం

ప్రత్యర్థి పార్టీ బలంతో కాదు.. బీఆర్ఎస్ నేతల చర్యలే !

అశ్వారావుపేట ఆర్ సి, సూర్య (మేజర్ న్యూస్)- మండలపరిధిలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘోర పరాజయం పాలయింది. ప్రత్యర్థి పార్టీ బలంతో కాదు..బీఆర్ఎస్ నేతల చర్యలే ఇందుకు కారణమని పార్టీ శ్రేణులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వర రావు పాల్గొనకపోవడం పార్టీ కార్యకర్తల్లో తీవ్ర నిరుత్సాహాన్ని కలిగించిందని బహిరంగంగానే వాపోతున్నారు. మాజీ ఎమ్మెల్యే హోదాతో పాటు అశ్వారావుపేట మండలానికి పార్టీ ఇంచార్జ్‌గా ఉండి కూడా గ్రామ గ్రామాన ప్రచారం చేయకపోవడం, అభ్యర్థులకు అండగా నిలవకపోవడం ఇవన్నీ ఎన్నికల ఫలితాల పై ప్రత్యక్ష ప్రభావం చూపాయని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. 2లో



## ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

- మూడవ విడత గ్రామ పంచాయతీ పోలింగ్ కు అన్ని ఏర్పాటు పూర్తి
- నిబంధనల ప్రకారం ఎన్నికల సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలి
- ఉదయం 7 గంటల నుండి ఒంటి గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుండి కౌంటింగ్
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్, సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు
- సింగరేణి మండలం కారేపల్లి జూనియర్ కళాశాల ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను తనిఖీ చేసి, ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం, డిసెంబర్ -16 : మూడవ విడత గ్రామాల్లో పోలింగ్ ఎలాంటి లోపాలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, తెలిపారు. ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. 2లో




## క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను సందర్శించిన పోలీస్ కమిషనర్

ఖమ్మం సూర్య న్యూస్ : మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సింగరేణి మండలంలోని పలు క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. కారేపల్లిలో పోలింగ్ కేంద్రంలో బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ప్రతిఒక్కరు సమన్వయం పాటించాలని విజ్ఞప్తి చేశారు. 2లో

# కాంగ్రెస్‌కు కరువొచ్చిందా..?

మొదటి పేజీ తరువాయి

కాగా ఈ వ్యవహారం ఇంతగా ముదరడానికి కారణం కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న వర్గ విభేదాలేనని తెలుస్తోంది.హస్తం గూటిలోనే ఉంటూ వేరువేరు వర్గాలుగా మారిన నాయకులు ఎవరికి తోచిన రాజకీయం వారు చేస్తున్నడంతో నిఖార్సైన కాంగ్రెస్ కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. ఈ వర్గాలను మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, తాజా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావులు పెంచి పోషిస్తున్నట్లుగా కాంగ్రెస్ శ్రేణులు బాహాటంగానే చర్చించుకుంటున్నాయి. నాయకుల మధ్య సయోధ్య కుదర్చకుండా వారందరినీ ఒక తాటిపైకి తేకుండా పార్టీ ప్రతిష్ఠ భంగపడటానికి పరోక్షంగా కారణమవుతున్నారని సగటు కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు.

## సిసలైన కాంగ్రెస్ వాదులకు పార్టీలో చుక్కెదురు

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీనే నమ్ముకుని ఉన్న కరుడుగట్టిన కాంగ్రెస్ వాదులకు ప్రస్తుతం పార్టీలో ప్రాధాన్యత ఇవ్వపోవడం.....ఇతర పార్టీల నుండి కాంగ్రెస్ లో చేరిన వారికి పెద్దపీట వేస్తున్నారంటూ సీనియర్ కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు.తామేమీ ఇతర పార్టీల నుండి గెలిచిన వారిని తీసుకొచ్చి మేమే గెలిపించామని గొప్పలు చెప్పుకోవడం లేదని....కాంగ్రెస్ పార్టీలో ముందు నుండి ఉన్న వారికే మద్దతు ఇచ్చి గెలిపించుకున్న వారినే తాము కాంగ్రెస్ సర్పంచులుగా ప్రకటించామని ఒక వర్గం నాయకులు బహిరంగంగానే చెబుతున్నారు.అయితే చర్ల మండల కాంగ్రెస్ లో పాత కొత్త నాయకుల మధ్య ఏర్పడిన ఆధిపత్య పోరు లీడర్లనే కాదు కేడర్ ని కూడా రెండు వర్గాలుగా మార్చిందని చెప్పవచ్చు.ఈ పరిణామాల వల్ల రాబోయే ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలలో రెండు వర్గాల నాయకులు తాము సూచించిన అభ్యర్థులకే పార్టీ బీ ఫామ్ ఇవ్వాలని అధిష్ఠానం మీద ఒత్తిడి తీసుకువచ్చే అవకాశం మెండుగా ఉన్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీనికి తోడు చర్ల మండల కాంగ్రెస్ పార్టీలోని ఒక వర్గం బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఒక సీనియర్ నాయకురాలికి కాంగ్రెస్ తీర్థం ఇప్పించి ఎంపీటీసీగా పోటీ చేయించి గెలిపించి ఎంపీపీ పదవిని కట్టబెట్టాలని యోచిస్తున్నారని సమాచారం. మరొక వర్గం మాత్రం కాంగ్రెస్ పార్టీలో చురుకైన మహిళా నాయకురాలిగా ఉంటూ గతంలో ఎంపీటీసీగా పనిచేసిన అనుభవం ఉన్న మహిళా కాంగ్రెస్ నాయకురాలినే ఎంపీటీసీగా గెలిపించి ఎంపీపీ చేయాలని చూస్తున్నారని తెలుస్తోంది.అయితే ఈసారి ఎన్నికలలో పార్టీ గుర్తు ఉంటుంది కాబట్టి ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు అభ్యర్థులను నిర్ణయించడం జరగదని అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని తటస్థ నేతలు చెబుతున్నారు.కాంగ్రెస్ పార్టీలో ప్రజాధరణ కలిగిన నాయకులకు కొదవలేదు కానీ ప్రస్తుతం వారందరినీ కాదని ఇతర పార్టీల నాయకులను చేర్చుకొని వారిని కాంగ్రెస్ అభ్యర్థులుగా ప్రకటించి గెలిపించాలని ఆలోచించడం చూస్తే కాంగ్రెస్ పార్టీకి ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల కరువు ఏర్పడిందా అనే అనుమానం కలుగక మానదు.

## కాంగ్రెస్ పార్టీలో ఇసుక తుఫాన్

గత అసెంబ్లీ ఎన్నికల తరువాత బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ గూటికి వచ్చిన నాయకులు సీనియర్ నాయకులతో విభేదించి ఒక వర్గంగా మారడం వారికి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అండదండలు ఉండడం వారందరూ ఇసుక వ్యాపారులు అవడంతో చర్ల మండల కాంగ్రెస్ పార్టీలో ఇసుక తుఫాన్ రేగిందని చెప్పవచ్చు.ఈ తుఫాన్ మండల కాంగ్రెస్ పార్టీని రెండు ముక్కలు చేసిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.పార్టీ ప్రతిష్ఠ భంగపడుతుందని తెలిసినా జిల్లా అధిష్ఠానం,ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు....నాయకుల మధ్య సమన్వయం చేయకపోవడంతో ఆ ఎఫెక్ట్ గ్రామ పంచాయతీ ఎన్నికలపై పడిందని, కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేయడంతో ఎవరు ఏ పార్టీ నాయకులో అర్థం కావడంలేదని,ఒక వర్గం ఖచ్చితమైన కాంగ్రెస్ వాదులుగా ఉంటున్నారని మరొక వర్గం నాయకులు బిఆర్ఎస్ తో కలిసి ఆ పార్టీ మాదే ఈ పార్టీ కూడా మాదే అన్న చందంగా పనిచేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

## విడివిడిగా విజయోత్సాహం

కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచ్ లను కూడా విడదీసి ఒక వర్గం నాయకులు మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య దగ్గరకు తీసుకువెళ్లగా మరొక వర్గం నాయకులు ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు ఆశీస్సులను అందించేందుకు తీసుకువెళ్లారు. కాంగ్రెస్ సర్పంచులను అందరిని ఒకే వేదికపైకి తీసుకొచ్చి తెల్లం,పొదెం ఆశీస్సులు అందిస్తే కార్యకర్తల్లో మనోధైర్యం, రాబోయే ఎన్నికలకు నూతన ఉత్తేజం నింపినట్లు అవుతుంది కానీ ఇలా ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు గ్రూపులుగా వారికి నచ్చిన నాయకుల దగ్గరకు వెళుతుండడంతో కిందిస్థాయి నాయకులలో, కార్యకర్తల్లో గందరగోళం నెలకొంటుందని చెప్పవచ్చు. ఇప్పటికైనా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు చర్ల మండల కాంగ్రెస్ లో జరుగుతున్న పరిణామాలపై దృష్టి సారించి నాయకులందరినీ ఒకతాటిపైకి తీసుకువచ్చి కాంగ్రెస్ శ్రేణుల్లో మనోధైర్యం, నూతనోత్సాహం నింపేందుకు ప్రయత్నించాలని కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు కోరుతున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో... అశ్వారావుపేటలో బీఆర్ఎస్ ఘోర పరాజయం

మొదటి పేజీ తరువాయి

దీంతో పాటు మరో అంశం పార్టీలో మరింత కలకలం రేపుతోంది. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడుతన స్వంత గ్రామంలోనే పార్టీ చిత్తుగా ఓడిపోవడం నాయకత్వ వైఫల్యానికి నిదర్శనంగా మారిందని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తన స్వంత గ్రామంలోనే పార్టీ దారుణ పరాజయం పాలవడం పట్ల పార్టీ శ్రేణుల్లోనే కాదు, రాజకీయ వర్గాల్లోనూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ గెలిచే అవకాశం ఉన్న చోట కూడా డమ్మీ అధ్యక్షుడిపై అసమ్మతి స్వరం ఎక్కువవ్వడంతో చేజేతులారా పార్టీ గెలుపును చెడగొట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.నాయకత్వ సామర్థ్యం, పార్టీ నిర్వహణ పద్ధతులపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయని కార్యకర్తలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## ఈ పరిస్థితికి మూలం ఎక్కడ...?

పార్టీ వర్గాల ఆరోపణల ప్రకారం మాజీ ఎమ్మెల్యేకు ప్రధాన అనుచరుడిగా పేరున్న బీఆర్ఎస్‌లో కీలక నేత కుమారుడు ప్రస్తుత ప్రభుత్వంలో ఓ మంత్రి ఆశీస్సులతో పలు కాంట్రాక్టులు దక్కించుకున్నారన్న ప్రచారం జరుగుతోంది.ఈ నేపథ్యంలోనే పుత్ర వాత్సల్యం కారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని కావాలనే బొంద పెట్టారని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.పార్టీ బలోపేతం కావద్దన్న ఉద్దేశంతోనే అనుభవజ్ఞులైన సీనియర్ నాయకులను పక్కన పెట్టి,కేవలం ఆదేశాలు పాటించే డమ్మీ మండల అధ్యక్షుడిని నియమించారని తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇది వ్యూహాపరమైన పొరపాటా? లేదా ముందే నిర్ణయించుకున్న రాజకీయ నిర్వీర్యతా? ప్రచారం చేయని మాజీ ఎమ్మెల్యే ...పని చేయని పార్టీ ఇంచార్జ్ ..నాయకత్వం లేని మండల అధ్యక్షుడు..ఈ మూడు అంశాలే కలిసి అశ్వారావుపేటలో బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణమయ్యాయన్న అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో బలంగా స్థిరపడుతోంది.రక్తం చెమటతో పార్టీని నిలబెట్టిన కార్యకర్తలు ఒకవైపు,వ్యక్తిగత ప్రయోజనాలు, కాంట్రాక్టుల పరిరక్షణ కోసం పార్టీని తాకట్టు పెట్టిన నేతలు మరోవైపు ఇదే ఈ ఎన్నికల అసలు దృశ్యం.ఇప్పుడు బీఆర్ఎస్ నాయకత్వం ముందు నిలిచిన ప్రశ్న ఒక్కటే ఈ ఓటమికి బాధ్యులెవరు..? పుత్ర వాత్సల్య రాజకీయాలకు ఎప్పుడు బ్రేక్ వేస్తారు..? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకపోతే,ఇది కేవలం ఒక మండల పరాజయం కాదు,రాబోయే రోజుల్లో పార్టీ భవిష్యత్తునే నిర్ణయించే హెచ్చరికగా మారుతుంది.

# క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను సందర్శించిన పోలీస్ కమిషనర్

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని, శాంతియుత ఎన్నికల నిర్వహణకు అభ్యర్థులు, స్థానిక ప్రజలకు,రాజకీయ నాయకులు సహకారం అందించాలన్నారు. సెక్షన్ 163 BNSS యాక్ట్ అమల్లో ఉన్నందున ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, నిబంధన అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

# ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి

మొదటి పేజీ తరువాయి

జిల్లాలో డిసెంబర్ 17న మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా సింగరేణి మండలం కారేపల్లి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలను మంగళవారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలలో బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ లో వినియోగించే ఎన్నికల సామాగ్రిని పరిశీలించారు. కేంద్రంలో ఆర్.వో. లు, పోలింగ్ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి చెక్ లిస్టు ఆధారంగా అందినదా లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని, పంచాయతీ ఎన్నికల్లో నిబంధనల ప్రకారం ఎన్నికలహాసిబ్బంది తమ విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని, ఎక్కడ ఎటువంటి వివాదాలు లేకుండా సజావుగా ఎన్నికలు జరిగేలా చూడాలని అన్నారు. డిసెంబర్ 17 బుధవారం మూడవ విడతలో జిల్లా నందు ఏడు మండలాలు సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, సింగరేణి, ఏన్కూర్ పరిధిలో సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు పోలింగ్ జరుగుతుందని అన్నారు. పోలింగ్ ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందని, ఆ తర్వాత మధ్యాహ్నం రెండు గంటల నుండి కౌంటింగ్ నిర్వహించి, ఉప సర్పంచ్ ఎన్నిక పూర్తి చేసి ఫలితాలను వెల్లడిస్తామన్నారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్ సరళిని, బ్యాలెట్ పేపర్ ను బ్యాలెట్ బాక్స్ లో ఓటర్ల వేసే విధానాన్ని ఖచ్చితంగా పరిశీలించాలని అన్నారు. ఎన్నికల సిబ్బంది ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పూర్తి నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని, జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా పూర్తిచేయాలని, ఎక్కడ తొందరపాటు లేకుండా ఆర్ఓ పూర్తి భాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు కల్పించామని వివరించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశామని, సీసీ కెమెరా ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని, సెన్సిటివ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లు నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామ పంచాయతీ పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలనే ఉద్దేశంతో లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ప్రజాస్వామ్యం ద్వారా లభించిన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించాలని అన్నారు. గ్రామంలో ప్రతి ఒక్క ఓటు విలువైనదని, ఓటర్లు అందరూ నిర్ణీత సమయానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చి, ఎవరి ప్రభావానికి లోను కాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని కలెక్టర్ అన్నారు. పోలింగ్ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, ప్రత్యేక అవసరాలున్న ఓటర్లకు సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీసిఈవో దీక్షారైనా, మండల ప్రత్యేక అధికారులు రాజేశ్వరి, చందన్ కుమార్, సింగరేణి మండల తహసీల్దార్ రమేష్, యంపిడివో శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ గెలుపులో ప్రధాన పాత్ర పోషించిన టిపిసిసి సోషల్ మీడియా టీం

## మీడియా కోఆర్డినేటర్ సయ్యద్ అహ్మద్ రషీద్



దమ్మపేట, సూర్య (మేజర్ న్యూస్) – మండలంలోని 31 పంచాయతీలలో, వార్డ్ మెంబర్లుగా సోషల్ మీడియా మీడియా వేదికగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాపాలన కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తూ అహర్నిశలు కష్టపడి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కోసం వారి విజయానికి బాటలు వేయడంలో కీలకపాత్ర పోషించిందని మండలం టిపిసిసి సోషల్ మీడియా కోఆర్డినేటర్ సయ్యద్ అహ్మద్ రషీద్ పేర్కొన్నారు.దమ్మపేట సర్పంచ్ అభ్యర్థి అయినటువంటి పగడాల రమాదేవి రాంబాబు గెలుపుకు దమ్మపేట టౌన్ సోషల్ మీడియా ఇంచార్జ్ జెట్టి వెంకటేష్ నాయుడు ప్రచార కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ ఇంటింటి ప్రచారం బైక్ ర్యాలీలను ఉత్సాహంగా పాల్గొంటూ గెలుపులో భాగమై ఉన్నారన్నారు.ఈ క్రమంలో రషీద్ వారిని అభినందించారు దమ్మపేట సర్పంచ్ గా గెలిచిన పగడాల రమాదేవి, రాంబాబు లకు శుభాకాంక్షలు తెలియజేసారు.

సూర్య
www.suryaa.com

బుధవారం 17, డిసెంబర్, 2025

# అసంఘటిత కార్మికులకు అండ సిపిఐనే

**కార్మికులు అనుభవించే ప్రతిహక్కు ఏఐటీయూసీ పోరాట ఫలితమే**

**హక్కుల సాధన, పరిరక్షణకు ఎర్రజెండా అభ్యర్థులను గెలిపించండి**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని**



**కొత్తగూడెం,సూర్య (మేజర్‌న్యూస్) –** సంఘటిత,అసంఘటిత కార్మికులకు అండగా నిలబడి వారి హక్కులను పరిరక్షిస్తూ, నూతన హక్కులను సాధించిపెడుతుంది ఎర్ర జెండానేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో మంగళవారం జరిగిన కొత్తగూడెం డివిజన్ హమాలీ కార్మికుల సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. కార్మికులు అనుభవిస్తున్న ప్రతి హక్కు, సౌకర్యం వెనుక ఏఐటీయూసీ, సిపిఐ పోరాటం ఉందని, పోరాటాలు సాగిస్తేనే హక్కులు ఏర్పడతాయని అన్నారు. హక్కుల సాధనకు, పరిరక్షణకు ఎర్ర జెండాపై పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గరీబ్ పేట, హేమచంద్రాపురం తదితర పంచాయతీల్లో హమాలీ కార్మికులు పెద్ద సంఖ్యలో ఉంన్నారని, విజ్ఞతతో అలోచించి ప్రజలు, కార్మికులకు పోరాడి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు. సమావేశం సందర్భంగా రామాంజనేయ కాలనీ సర్పంచి, 12మంది వార్డు సభ్యులు కూనంనేనిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించారు.

# సింగరేణి ఇంచార్జి సిఎండీగా కృష్ణ భాస్కర్



**విధుల్లో చేరిన సి ఎండీని సన్మానించిన బలరాం**

**కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్) –** ప్రభుత్వరంగ సంస్థ అయినా సింగరేణి ఛైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గా సీనియర్ ఐఏఎస్ అధికారిగా ఉన్న కృష్ణ భాస్కర్‌ను మంగళవారం ఇంచార్జి సిఎండీ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం సి అండ్ ఎండీ గా ఉన్నా బలరాం నాయక్ డిప్యుటేషన్ గడువు ముగియడంతో అయన స్థానంలో కృష్ణ భాస్కర్ కు బాధ్యతలు అప్పగించారు.దింతో కృష్ణ భాస్కర్ ను హైదరాబాద్ లోని సింగరేణి భవన్ లో బలరాం నాయక్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి పట్టు శాలువాతో సత్కరించి స్వగతం పలికారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పా గౌతమ్ పోట్రు తో పాటు సంస్థకు చెందిన ఇతర డైరెక్టర్లు పాల్గొనడం గమనార్హం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలో నడుస్తున్న సింగరేణి కి కేంద్ర రెవిన్యూ సర్వీస్ నుండి డిప్యుటేషన్ పై తెలంగాణకు వచ్చిన బలరాం సింగరేణిలో సంచాలకుడిగా, ఇంచార్జి సీఎండీ గా 6 ఏండ్ల పాటు పని చేశారు. కేంద్రం నుండి రాష్ట్రానికి వచ్చిన అధికార్లకు డిప్యుటేషన్ గడువు సాధారణంగా 5 ఏండ్లే ఉంటుంది. అంతకు మించి ఏడాది అదన్మగా ఉన్నందున మరోసారి గడువు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరలేదని తెలుస్తుంది. గత కొన్ని రోజులుగా నూతన సీఎండీ నియామకం పై కొనసాగిన ఉత్కంఠకు కృష్ణ భాస్కర నియామకంతో తెరపడినట్లైయింది.



# న్యూ డెమోక్రసీ అభ్యర్థులను ఓడించడానికి అధికార పార్టీ కుట్ర





**జిల్లా కలెక్టర్, ఎస్పీ లకు న్యూ డెమోక్రసీ నేత మధు ఫిర్యాదు**

**ఇల్లందు ఆర్‌సి,సూర్య (మేజర్‌న్యూస్) –** నేడు జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో న్యూ డెమోక్రసీ పార్టీ అభ్యర్థులను ఓడించడానికి అధికార పార్టీ కుట్ర చేస్తున్నదని, ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఇల్లందు ఏరియా న్యూ డెమోక్రసీ నాయకులు ఆవునూరు మధు జిల్లా కలెక్టర్, ఎస్పీ లకు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా మంగళవారం నాడు ఎన్నికల అధికారులను వారు కలిశారు.మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నేడు జరగనున్నాయని, ఈ ఎన్నికలలో న్యూ డెమోక్రసీని ఓడించడానికి అధికార పార్టీ అక్రమ పద్ధతులకు పూనుకున్నదనీ, గుండాల కొమరారం పోలీసులని ఉపయోగించుకొని న్యూ డెమోక్రసీ పై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నదనీ వారన్నారు. అందులో భాగంగానే న్యూ డెమోక్రసీకి మద్దతు తెలియజేసిన ఈసం పాపారావును స్టేషన్ కి పిలిపించి గంటల తరబడి కూర్చో పెడుతూ న్యూ డెమోక్రసీకి ఓట్లు వేయొద్దని ఒత్తిడి చేస్తున్నారనీ పేర్కొన్నారు. కొమరారం ఎస్ఐ న్యూ డెమోక్రసీ నాయకులను కార్యకర్తలను స్టేషన్ కి పిలిపించి బెదిరింపులకు గురి చేస్తున్నాడనీ, కాంగ్రెస్ నాయకులు డబ్బులు పంచుకోవడానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాడనీ, అదేవిధంగా కాంగ్రెస్ గెలుపు కోసం గుండాల, కొమరారం ఎస్సై లు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.ఈ విషయమై ఎన్నికల అధికారులైన జిల్లా కలెక్టర్, డిపిఓలకు, కొత్తగూడెం జిల్లా పోలీస్ ఎస్పీ కి తెలియజేయడం చేయడం జరిగిందని, అధికారులు కూడా వెంటనే స్పందించారనీ పేర్కొన్నారు. సజావుగా ఎన్నికలు జరిగే విధంగా చర్యలు చేపడతామని హామీ కూడా ఇచ్చారనీ అన్నారు.

# ఇల్లందు ఏరియాలో పర్యటించిన డైరెక్టర్

**ఇల్లందు ఆర్ సి,సూర్య (మేజర్ న్యూస్)–** సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కే.వెంకటేశ్వర్లు మంగళవారం ఇల్లందు ఏరియాలోని జి.యం కార్యాలయంలలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు జెకె–5, ఓ.సిలో జరుగుచున్న పనులను జీఎం వి.కృష్ణయ్య ను అడిగి తెలుసుకున్నారు. తరువాత నూతన జే కే కోల్ మైన్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుకు సంబంధించిన మ్యాప్ మరియు రికార్డ్సను పరిశీలించి రివ్యూ చేపట్టారు. నూతన ఓసికి సంబంధించిన పనులను త్వరగా పూర్తిచేసి అక్కడి నుండి బొగ్గు రవాణా జరిగేటట్లు చూడాలని ఏరియా జీఎం వి.కృష్ణయ్య కి తెలియచేసారు.ఈ కార్యక్రమం లో జి.యం (ఎస్టేట్) లక్ష్మిపతి గౌడ్, ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, ఎస్ ఓ టు జి.యం. రామస్వామి, కే.ఓ.సి.పి.ఓ కే.గోవిందా రావు, జే.కే ప్రాజెక్ట్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, డీజిఎం పర్సనల్ అజ్మీర తుకారాం, డిజియం ఐఈడి ప్రభాకర్, డీజిఎం (సివిల్) రవి కుమార్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇల్లందు సబ్ డివిజన్ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలి



**ఇల్లందు ఆర్‌సి, సూర్య (మేజర్‌న్యూస్) –** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బి రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు ఇల్లందు సబ్ డివిజన్ పరిధిలో వున్న గ్రామపంచాయతీ ఎన్నికల ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇల్లందు డిఎస్పి ఎన్ చంద్రబాను కోరారు.సబ్ డివిజన్ పరిధిలో నేడు జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా కొనసాగాలని డి.ఎస్.పి తెలిపారు.ఎన్నికల నిర్వహణపై సమగ్ర పర్యవేక్షణలో భాగంగా ఇల్లందు మండలాల్లోని గ్రామపంచాయతీ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, కోసం 650 మంది పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశామని ఓటర్లకు సౌకర్యాలపై సబ్ డివిజన్ అధికారులతో సమీక్ష నిర్వహించామని,ఓటర్లు క్యూలైన్‌ను తప్పనిసరిగా పాటిస్తూ ఉండాలని అనవసరంగా గుంపులుగా ఉండకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు.ముఖ్యంగా పోలింగ్ కేంద్రాలకు సుమారు 100 మీటర్ల దూరంలో ఉండాలని, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టు దిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీస్పీ తెలిపారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఎక్కడైనా సమస్యలు లేదా అనుమానాస్పద ఘటనలు తలెత్తితే వెంటనే సమీప పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని డీస్పీ సూచించారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పూర్తై ఫలితాల వెల్లడి ముగిసే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భద్రతా చర్యలు నిరంతరంగా కొనసాగుతాయని ఎవరైనా ఉల్లంఘించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకొనబడతాయని డీఎస్పీ స్పష్టం చేశారు.

# పెట్రోల్ బంకులో ఉద్యోగాలు..



**అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్) –** మండల కేంద్రంలోని జిసిసి పెట్రోల్ బంక్‌లో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని దమ్మపేట జీసీసీ మేనేజర్ కోట పాపారావు తెలియజేశారు. మంగళవారం అయినా పెట్రోల్ బంకును సందర్శించి సమస్యల పరిష్కారం కోసం గత ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు.గత ఉద్యోగులు పెట్రోల్ బంకులో ఇచ్చే జీతం సరిపోవట్లేదని, రూ 12 వేలు జీతం ఇస్తేనే ఉద్యోగం చేస్తామని, లేదంటే విరమణ చేస్తున్నామని లిఖిత పూర్వకంగా దరఖాస్తు అందజేశారు.ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ గత 15 రోజుల నుండి ఫ్యూయల్ అటెండెంట్ డైలీ వర్కర్ రావట్లేదని, దాని వలన పెట్రోల్ బంకు మూతపడిందని, పునర్ ప్రారంభించడానికి సిబ్బందితో చర్చించామన్నారు. అనంతరం విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ పెట్రోల్ బంకులో 6 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని , గిరిజన యువతి యువకులు దరఖాస్తులు చేసుకోవాలని, పదవ తరగతి పాసై, 21–35 సంవత్సరాల యువతీ యువకులు అర్హులని , పూర్తి సమాచారం కొరకు జిసిసి దమ్మపేట మేనేజర్ 8008211082 ను సంప్రదించాలన్నారు.

# స్క్రాప్ పట్టుకున్న సింగరేణి అధికారులు



**ఇల్లందు క్రైమ్, సూర్య (మేజర్ న్యూస్)–** పట్టణానికి చెందిన ఓ స్క్రాప్ యజమాని షాపులో సింగరేణికి చెందిన పాత ఇనుమును డీసీఎం వ్యాన్‌లో లోడ్ చేస్తుండగా మంగళవారం సింగరేణి అధికారులు పట్టుకున్నారు. అనంతరం డీసీఎం వాహనాన్ని పోలీస్ స్టేషన్ కు తరలించారు. స్క్రాప్ విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని అంచనా. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణ కోసమే పోలీసుల కవాతు- డీఎస్పీ




**టేకులపల్లి, సూర్య (మేజర్ న్యూస్)–** శాంతిభద్రతల పరిరక్షణ కోసమే పోలీసుల కవాతు నిర్వహిస్తున్నామని ఇల్లందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. పంచాయతీ ఎన్నికల మూడో విడత సందర్భంగా మంగళవారం టేకులపల్లి మండల కేంద్రంలో ఇల్లందు డీఎస్పీతోపాటు టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ అరకుల రాజేందర్ ఆధ్వర్యంలో పోలీస్ బలగాలతో మండల కేంద్రంలోని దాసుతండ నుంచి గోల్యాతండా వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ స్థానిక ఓటర్లతో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకొనేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. అభ్యర్థులు ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా.. శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్ల తమ ఓటుహక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీలు కల్వర్టు వెంటనే నిర్మాణం చేపట్టాలి

### సిపిఎం జిల్లా నాయకులు బాల నర్సారెడ్డి



**భద్రాచలం ఆర్సి, సూర్య (మేజర్ న్యూస్) –** పట్టణంలోని కెసిఆర్ కాలనీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల దగ్గర రోడ్లు వేసి, డ్రైనేజీల పైన కల్వర్టులు మరిచారని దాని వలన ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని, వరదలు వచ్చినప్పుడు ఆ డ్రైనేజీలో పిల్లలు కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడ్డాయని సిపిఎం జిల్లా నాయకులు బాల నర్సారెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా డ్రైనేజీలు క్లీన్ చేయకపోవడం వల్ల విపరీతమైన దోమలు పెరిగాయని ప్రక్కల ఉన్నటువంటి ఖాళీ స్థలాల్లో తుప్పలు పెరిగి పాములు, ఇతర విషపు కీటకాలు ,సంచరిస్తూ అనేకమంది ఇబ్బందులు గురవుతున్నారని, వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, పక్కనే ఉన్నటువంటి ,గిరిజన గురుకుల, పాఠశాలలో సుమారు 300 మంది విద్యార్థులు ,చదువుకుంటుండగా హాస్టల్ కి వెళ్లే రహదారి సక్రమంగా లేదని,సిసి రోడ్డు వెంటనే వేయాలని ,దాని



చుట్టుపక్కల ,ఉన్న తుప్పలను కొట్టి, ప్రస్తుతం సోలార్ లైట్లు అయినా, ఏర్పాటు చేయాలని, అలాగే హాస్టల్ పిల్లలకి చుట్టూ ఫెన్సింగ్ ,సక్రమంగా లేకపోవడం వలన డ్రైనేజీ మురికి కంపు కొడుతూ, పిల్లలు రోగాల పాలవుతున్నారని ,పందులు సంచరిస్తున్నాయని కావున వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేసి డ్రైనేజీని నిర్మించి, హాస్టల్‌లో ఉండే పిల్లలను ఆదుకోవాలని, అలాగే ఆ కాలనీలో ఉండే సమస్యలన్నీ పరిష్కరించాలని సిపిఎం పార్టీ బృందం నిర్వహించిన సర్వేలో, ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని ,కోరుతూ స్థానిక గ్రామపంచాయతీ, ఈఓ కి వినతిపత్రం ఇవ్వడం జరిగినది. రెండు మూడు రోజుల్లో ఈ సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చినారు హామీ అమలు కాకపోతే, పరిష్కారం కాకపోతే ఆందోళన నిర్వహిస్తామని ,సిపిఎం పార్టీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ,ఎంబీ నర్సారెడ్డి, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, నాలుగో వార్డ్ మెంబర్ అయినటువంటి బండారు శరత్ బాబు ,పట్టణ కమిటీ సభ్యులు కుంజా శ్రీనివాస్ ,సున్నం ప్రవీణ్, గంగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లానాయకులు రవీంద్ర పాల్గొన్నారు.

# నూతన సర్పంచులను సత్కరించిన వగ్గేల పూజ



**దమ్మపేట, సూర్య (మేజర్ న్యూస్)–** మండలంలోని వివిధ గ్రామపంచాయతీలలో సర్పంచ్‌లుగా గెలుపొందిన వారిని అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు వగ్గేల పూజ ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం మండల పరిధిలోని పార్కల గాండిలో నూతన సర్పంచ్ లుగా గెలిచినా కొమరం సుశీల, పెద్దగొల్లగూడెంలో యట్ల రామదాసు, రాచురపల్లిలో కునుసోతు ధనలక్ష్మి చిట్టిబాబు లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు సున్నం నరేంద్ర పాల్గొన్నారు.

# ఫలించిన పగడాల వ్యూహం..

### గెలుపే ధ్యేయంగా ముందుకు సాగిన పగడాల రాంబాబు...



**దమ్మపేట, సూర్య(మేజర్‌న్యూస్) –** ఈనెల 14వ తేదీన జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల సమరంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పగడాల రమాదేవి భర్త పగడాల రాంబాబు గెలుపే ధ్యేయంగా ముందుకు సాగుతూ మంచితనం అనే ఆయుధంతో ఓటర్ల ముందుకు వెళ్లి గ్రామపంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేసే దిశలో ఓటర్లకు హామీలు ఇచ్చి ఓటర్ల హృదయాలలో గెలుపు స్థానాన్ని పదిలం చేసుకున్నారు. గ్రామపంచాయతీలో అధిక శాతం ఓట్లు ఉన్న ఆర్యవైశ్యుల ఓట్లు సైతం పగడాల రమాదేవికి పడడం ప్రత్యర్థికి అంతుచిక్కని విషయంగా మారింది. బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి దారా రోహిణి కమ్యూనిటీ కి సంబంధించిన ఓట్లు సుమారు 1200 ఆర్యవైశ్యులవి ఉండగా కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పగడాల రమాదేవి కాపు కమ్యూనిటీకి చెందిన ఓట్లు 850 ఉండడం ఒక దశలో బిఆర్ఎస్ అభ్యర్థి దారా రోహిణి దే గెలుపు ఖాయమని గ్రామపంచాయతీలో అలజడి మొదలయ్యింది. ఇది ఇలా ఉంటే స్థానిక కాపు కమ్యూనిటీలో ఐక్యత కొరవడిందని అదే కమ్యూనిటీకి చెందిన పగడాల రమాదేవి గెలుపుకు ఆటంకం కలిగే అవకాశాలు మెండుగా ఉన్నాయంటూ పుకారులు షికారు చేశాయి. ఈ క్రమంలోనే పగడాల రమాదేవి గెలుపుకు ఆ కమ్యూనిటీలోనే కొందరు మేధావులు వ్యూహాలు రచిస్తూ ఎలాగైనా గ్రామపంచాయతీ పీఠాన్ని వశం చేసుకోవాలనే ఎత్తుగడలతో ముందుకు సాగుతూ ఎక్కడ ఇబ్బందులు ఉన్నాయో వాటిని అతిక్రమించి ధైర్యాన్ని వీడకుండా ముందుకు సాగారు. ప్రత్యర్థి ఓటర్లకు ఎన్ని ప్రలోభాలు చూపిన ఎవరికి ఓటు వేయాలో ముందుగానే ఫిక్స్ అయిన ఓటర్లు ఓటు అనే ఆయుధంతో పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటుగా బాటలు వేశారు ఓటింగ్ సమయం దగ్గర పడుతున్న కొద్దీ అభ్యర్థులలో ఉత్కంఠ మొదలైంది. ఒక దశలో ఇద్దరు అభ్యర్థుల భర్తలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ ఇది నిజం.. ఇదే నిజం అంటూ సామాజిక మాధ్యమాలలో వీడియోలను ప్రసారం చేసి ఓటర్లలో గందరగోళాన్ని సృష్టించారు. గందరగోళ్ళని పట్టించుకోని ఓటర్లు వారు ఎటువంటి తీర్పును ఇవ్వాలో అదే తీర్పును ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పగడాల రమాదేవిని గెలిపించారు. కాంగ్రెస్‌కు కలిసి రావనే వార్డులలో వ్యూహాలు రచించుకుంటూ వార్డులలో సైతం విజయాన్ని సాధించాలనే పట్టుదలతో పట్టు వీడని విక్రమార్కుడిలా సిపిఐ,జనసేనతో కలిపి తొమ్మిది వార్డులతో విజయం సాధించారు. యువకుల అధిక ఓట్లు కలిగిన జనసేనతో పొత్తు పెట్టుకోవడంతో రెండు వార్డులలో జనసేన తన సత్తా చాటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పగడాల రమాదేవి విజయానికి దోహదపడింది. 12వ వార్డులో పోటీ చేసిన జనసేన అభ్యర్థి దాస రోజు సరిత 116 ఓట్ల మెజారిటీతో గెలుపొంది గ్రామపంచాయతీ వార్డులలో టాప్ లెవెల్‌లో నిలిచింది. ఈ దిశలోనే నాలుగవ వార్డులో జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన ఆంగోతు శీను కూడా గెలుపు బాట పట్టడంతో రెండు వార్డులు జనసేన పార్టీ ఖాతాలో వేసుకుంది. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దమ్మపేట గ్రామపంచాయతీ పై ప్రత్యేక దృష్టిని సారించి దమ్మపేట గ్రామపంచాయతీని కాంగ్రెస్ ఖాతాలో వేయాలనే ప్రధాన లక్ష్యంతో కార్యకర్తలు నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొని ప్రసంగించిన ఎమ్మెల్యే గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించి కాంగ్రెస్ అభ్యర్థి పగడాల రమాదేవికి ఓటు వేయాలనే పిలుపునివ్వడంతో గ్రామపంచాయతీ ప్రజలు పంచాయతీ అభివృద్ధికి ఆలోచన చేశారు. కాంగ్రెస్ పార్టీ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి పగడాల రమాదేవిని గెలిపించాలని ఫిక్స్ అయిన ప్రజలు గెలిపించి గ్రామపంచాయతీ పీఠాన్ని బహుమతిగా ఇచ్చారు.

# నేడు మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు

### కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

### శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

### ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

### ఎస్పీ రోహిత్ రాజు




**కొత్తగూడెం క్రైమ్, సూర్య (మేజర్ న్యూస్)–** జిల్లాలో మూడవ విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా రోహిత్ రాజు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మూడో విడుతలో సమస్యాత్మక, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ సమయంలో ఎవరైనా ఎన్నికల ప్రక్రియకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, గొడవలు సృష్టించినా ఎట్టి పరిస్థితుల్లో వారిని వదిలే ప్రసక్తే లేదని, వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎన్నికల సమయంలో కేసులు నమోదయితే భవిష్యత్తులో అనేక ఇబ్బందులకు గురవుతారన్నారు. జిల్లా ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించకోవాలని సూచించారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఊరేగింపులకు, ర్యాలీలకు అనుమతి లేదని బాణాసంచా కాల్చడం, డీజేలు ఏర్పాటు చేయడం నిషేధమని తెలియజేశారు. మూడో విడుతలో మొత్తం 249 పోలింగ్ స్థానాలలోని 1288 పోలింగ్ కేంద్రాలలో పోలీస్ శాఖ తరపున పూర్తిస్థాయి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుమారుగా 1500 మంది పోలీసులతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. 1288 పోలింగ్ కేంద్రాలలో సాధారణ పోలింగ్ కేంద్రాలు-619, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు-134, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు-168, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు-184, మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలు-183 లను గుర్తించినట్లు తెలిపారు.

# టేకులపల్లిలో పోలింగ్ కేంద్రాలకు చేరిన ఎన్నికల సామగ్రి

**టేకులపల్లి, సూర్య (మేజర్ న్యూస్)–** టేకులపల్లి మండలంలో పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలోని 36 పంచాయతీలకు ఎన్నికల సిబ్బందికి సామగ్రిని టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో పంపిణీ చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామాగ్రిని భారీ పోలీసు బందోబస్త్ మధ్య తరలించినట్లు ఎంపీడీవో మల్లేశ్వరి తెలిపారు. 36 పంచాయతీలకు 850 మంది సిబ్బంది ఎన్నికల విధులకు హాజరయ్యారని తెలిపారు. పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా ట్రైనీ కలెక్టర్



మురళి సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు.

# 3వ విడుత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

**గుండాల మండలంలో 9 గ్రామపంచాయతీలకు పోలింగ్**

**పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బంధోబస్తు**



**గుండాల, సూర్య (మేజర్ న్యూస్)–** గుండాల మండలంలో బుధవారం జరుగనున్న 3వ విడుత ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం మండల కేంద్రం నుంచి ఎన్నికల అధికారులు ఎన్నికల సామాగ్రితో ఆయా పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. గుండాల మండలంలో 11 పంచాయతీలకు గాను దామరతోగు, మామకన్ను పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. 9 గ్రామ పంచాయతీలలో 34 మంది సర్పంచ్ అభ్యర్థులు, 96 వార్డులలో 249 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి ఎన్నికల సిబ్బందికి తమ సామాగ్రిని అందించారు. సిబ్బంది వారికి కేటాయించిన కేంద్రాలకు బస్సుల ద్వారా చేరుకున్నారు. అన్ని గ్రామ పంచాయతీలలో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. గుండాల మండల కేంద్రంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, ఎన్నికల పరిశీలకులు సర్వేశ్వర్ రెడ్డి పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆశీర్వదించి అవకాశం ఇవ్వండి

**గుండాల గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలుపుతా**

**నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల అభివృద్ధికి తోడ్పడతా...**

**గుండాల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి వాంకుడోత్ బికోజి ( అజయ్)**



**గుండాల, సూర్య (మేజర్ న్యూస్)–** గుండాల గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఆశీర్వదించి అవకాశం ఇవ్వాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి గుండాల గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ గుండాల గ్రామపంచాయతీని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుటకు తన వంతు కృషి చేస్తానని సిపిఐ పార్టీ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ గుండాల సర్పంచ్ అభ్యర్థి వాంకుడోత్ బికోజి (అజయ్) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఆశించిన విధంగా అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ గ్రామపంచాయతీని మార్చే కర్తవ్యాన్ని ఒక అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రమే నెరవేర్చగలదన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు పేదవాడికి ప్రతి ఇంటికి చేరేలా తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రామపంచాయతీలోని ప్రజలు తనను ఒక కుటుంబ సభ్యునిగా భావించి ఈ ఎన్నికలలో ఆదరించి ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# ఎ కాలనీతండాలో కాంగ్రెస్‌లో భారీ చేరికలు



**టేకులపల్లి, సూర్య (మేజర్ న్యూస్)–** ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో టేకులపల్లి గ్రామపంచాయతీలోని 9, 10వ వార్డులలోని పలు కుటుంబాలు బీఆర్ ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు.కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఇస్లావత్ రెడ్యానాయక్ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. భూక్య బిగనా నాయక్, దారావత్ చంప్లా నాయక్, దారావత్ లక్ష్మ నాయక్, అజ్మీరా బద్దు నాయక్, బాలు నాయక్, గుగులోత్ సెత్రాం, దారావత్ కృష్ణ, భూక్య బుజ్జి, దారావత్ కాళీ, దారావత్ చిట్టీ, దారావత్ కాంతి, గుగులోత్ సునీత, బానోత్ కోన తదితరులు చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇల్లంద దు నియోజక వర్గ నాయకులు కోరం సురేందర్, ఈది గణేష్ , టేకులపల్లి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఇస్లావత్ రెడ్యానాయక్, నర్సింగ్ లక్ష్మయ్య, బోడ మంగీలాల్, మూడ్ గణేష్, నల్లమోతు వెంకన్న, జాటోత్ కిరణ్, భూక్య ఉష, దారావత్ సుమన్, రామారావు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం





పోలింగ్ కేంద్రాలకు చేరిన బ్యాలెట్ బాక్సులు

**ఆళ్లపల్లి, సూర్య (మేజర్ న్యూస్) –** ఆళ్లపల్లి మండల పరిధిలోని 12 గ్రామ పంచాయతీలకు బుధవారం జరగనున్న మూడో విడత జరిగే పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు పోలింగ్ కేంద్రాలకు చేరుకోగా అన్ని ఏర్పాట్లను అధికారులు మంగళవారం పూర్తి చేశారు. మండలంలో 12 గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిబ్బందిని నియమించి వారికి ఎన్నికల సామాగ్రిని అప్పగించారు.ఎన్నికల సిబ్బంది తమకు ఎన్నికల అధికారులు అందజేసిన సామాగ్రిని తీసుకొని ఆయా పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల ద్వారా పోలీస్ బందోబస్తు నడుమ చేరుకున్నారు. తదనంతరం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న అడవి రామవరం గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో బోడయికుంట గ్రామం నుంచి ఎన్నికల బ్యాలెట్ బాక్సులు అధికారులు ఓ వింతగా ట్రాక్టర్లో తీసుకెళ్లారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద రాత్రి నుంచే బందోబస్తును ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్సై సోమేశ్వర్ నేతృత్వంలో అన్ని పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు.

# కంపెనీ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు

**ప్రారంభించిన కొత్తగూడెం ఏరియా ఇంచార్జ్ జీఎం నరసింహారావు**

**క్రీడాకారులు గెలుపోటములను క్రీడాస్ఫూర్తి తో సమానంగా స్వీకరించాలి**









**కొత్తగూడెం సింగరేణి,సూర్య( మేజర్ న్యూస్)–** సింగరేణి కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రుద్రంపూర్ లోని ప్రొఫెసర్ జయ శంకర్ స్టేడియంలో 3 రోజులపాటు అనగా ఈనెల 16 నుండి 18వ తారీఖులలో నిర్వహించే కంపెనీ స్థాయి పురుషుల క్రికెట్ టోర్నమెంట్ పోటీలు మంగళవారం ప్రారంభం అయ్యాయి.ఈ క్రికెట్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా కొత్తగూడెం ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ ఎం.వి నరసింహారావు,విశిష్ట అతిథిగా జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ విచ్చేశారు.ముందుగా ముఖ్య అతిథి, విశిష్ట అతిథి, వేదికపై ఆశీర్నులైన ప్రముఖులతో జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం ముఖ్య అతిథి ఇంచార్జి జనరల్ మేనేజర్ ఎం.వి. నరసింహారావు ఒలంపిక్ పతాక ఆవిష్కరణ చేసి, బెలూన్ లను ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య, విశిష్ట అతిథులు ప్రారంభ ఉపన్యాసం లో మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ స్థాయి పురుషుల క్రికెట్ పోటీలను సింగరేణి కొత్తగూడెం ఏరియా నిర్వహించుకోవటం జరుగుతుందన్నారు. క్రీడా ప్రతిభతో స్నేహభావంతో క్రీడలలో రాణించాలని, క్రీడలు అనేవి శారీరక దృఢత్వానికి, ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ క్రీడా పోటీలలో గెలుపు ఓటములను సమానముగా తీసుకోవాలని సూచించారు.ఈ పోటీలలో పాల్గొనే కంపెనీ పరిధిలోని మూడు రీజియన్ లలో ఉన్న ఆరు (6) జట్లు అయిన కొత్తగూడెం అండ్ కార్పొరేట్, ఇల్లందు అండ్ మణుగూరు, భూపాలపల్లి అండ్ ఆర్జీ–3, ఆర్జీ–1 అండ్ ఆర్జీ–2 బెల్లంపల్లి అండ్ మందమర్రి, శ్రీరాంపూర్ రీజియన్ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రికెట్ పోటీలలో క్రీడాకారులు ఎటువంటి గాయాలు తగలకుండా జాగ్రతలు తీసుకుంటూ, స్నేహభావం తో ఈ 3 రోజుల క్రికెట్ పోటీలను విజయవంతం చేయాలని కోరారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఇన్చార్జి జిఎం తో పాటు జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, కొత్తగూడెం ఏరియా ఎఐటియూసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జే. గట్టయ్య, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, ఏజీఎం (సివిల్) సిహెచ్. రామకృష్ణ, ఎజిఎం (పర్సనల్) జి.వి. మోహన్ రావు, డిజిఎం (పర్సనల్) బి.శివ కేశవరావు, స్పోర్ట్స్ మేనేజర్ కే.సునీల్, డివై పిఎం జి. హరీష్, స్పోర్ట్స్ సూపర్వైజర్ లు, పర్సనల్, ఎస్,పిసి, ఈ, ఎం, సివిల్ శాఖల సిబ్బంధి, 6 జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

# అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగండి

**భద్రాచలం,ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**



**చర్ల, సూర్య (మేజర్ న్యూస్) –** స్థానిక ఎన్నికలలో చర్ల మండలంలోని వివిధ పంచాయతీలకు కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేసి సర్పంచ్ లుగా గెలుపొందిన వారిని నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. వారి గెలుపుకు విశేషంగా కృషి చేసిన కాంగ్రెస్ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ,పోలిన లంకరాజు,ఇర్ప వసంత్,పోట్రు బ్రహ్మానంద రెడ్డిలను ఎమ్మెల్యే వెంకట్రావు అభినందించారు. వీరి రాజకీయ చాతుర్యం వల్లనే ఆయా పంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ పదవిని కైవసం చేసుకున్నదని కొనియాడారు. గెలిచిన వారు పంచాయతీ పరిధిలోని గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన మార్క్ చూపాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరవద్దని త్వరితగతిన నెరవేర్చాలని ఎమ్మెల్యే సర్పంచులకు సూచించారు. చర్ల మండల పరిధిలోని సి కత్తిగూడెం, కేశవాపురం, మొగళ్ళపల్లి, సుబ్బంపేట, దేవరపల్లి, పెదిపల్లి, గొమ్ముగూడెం, కలివేరు, సత్యనారాయణ పురం సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లతో పాటు ఆదివాసీ జేఏసీ మద్దతుతో గెలిచిన బోధనల్లి సర్పంచ్ వంజం సింగయ్య కూడా ఎమ్మెల్యేను కలిశారు. ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే స్థానిక ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలలో ఇదే ఉత్సాహంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఎమ్మెల్యే వెంకట్రావు కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముమ్మినేని అరవింద్, గుండెపూడి సతీష్, కాపుల నాగరాజు,రాంపండు, అలవాల బాలు, చల్లకోటి వాసుదేవరావు, కట్ల అమ్మాజీ, నెరబోయిన చంద్రశేఖర్, ఆదివాసి జేఏసీ నాయకులు చందు, ఆయా పంచాయతీల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సూర్య
www.suryaa.com
బుధవారం 17, డిసెంబర్, 2025

# నేడు తుది విడత గ్రామపంచాయతీ ఎన్నికలు

**నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి**
**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**
**ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి**
**కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు**
**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**




**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, సూర్య (మేజర్ న్యూస్)** - జిల్లాలో తుది విడత గ్రామపంచాయతీ ఎన్నికలను పూర్తిస్థాయిలో, ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా మరియు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. జూలూరుపాడు, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, ఇల్లందు, అల్లపల్లి, గుండాల, టేకులపల్లి మండలాల్లో తుది విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జనరల్ అబ్జర్వర్ సర్వేశ్వర్ రెడ్డి, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ లావణ్య, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు, ఎన్నికల సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎన్నికల ఏర్పాట్లను సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుది విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా జిల్లాలోని ఏడు మండలాల్లో మొత్తం 155 గ్రామపంచాయతీలు, 1,330 వార్డులు ఉన్నాయని తెలిపారు. 155 గ్రామపంచాయతీలకు గాను రెండు గ్రామపంచాయతీలలో నామినేషన్లు దాఖలు కాలేదని, 8 గ్రామపంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయని, మిగిలిన 145 గ్రామపంచాయతీలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే 1,330 వార్డులకు గాను మూడు వార్డుల్లో నామినేషన్లు దాఖలు కాలేదని, 256 వార్డులు ఏకగ్రీవమయ్యాయని, మిగిలిన 1,071 వార్డులలో ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు గాను అవసరమైన సిబ్బంది సామాగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా అన్ని పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరిగిందని తెలిపారు.నేడు జరిగే పోలింగ్ సందర్భంగా అన్ని ఎన్నికల సిబ్బంది ఉదయం 7 గంటల కంటే ముందుగానే పోలింగ్‌కు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఓటరును నిశితంగా పరిశీలించి పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలని, బ్యాలెట్ పేపర్లపై ఉన్న గుర్తులను సిబ్బంది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. పోలింగ్ అనంతరం కౌంటింగ్ ప్రక్రియను రిటర్నింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో అనవసరమైన ఇతర సామాగ్రి ఏదీ ఉండకుండా కట్టుదిట్టమైన నియంత్రణ పాటించాలని ఆదేశించారు.సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ఫలితాలు పూర్తయిన వెంటనే ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియను చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డింగ్ తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు.కౌంటింగ్ పూర్తైన అనంతరం బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు తదితర ఎన్నికల సామాగ్రిని పూర్తిగా స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం, అవకతవకలు లేదా పొరపాట్లు చోటుచేసుకుంటే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ నివేదికలను సమయానుసారం ఎటువంటి అంతరాయం లేకుండా టీ%-%పోల్ యాప్‌లో నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ జరిగే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు కట్టుబడి, ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా, పారదర్శకంగా మరియు విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ తుది విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక మరియు అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు పోలీసు బలగాలను మోహరించినట్లు చెప్పారు. పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మొబైల్ పెట్రోలింగ్, చెక్ పోస్టుల ఏర్పాటు ద్వారా కట్టుదిట్టమైన నిఘా కొనసాగిస్తామని వెల్లడించారు. ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# దిగిపోయిన కార్మికుల బకాయిలు చెల్లించాలి

**బకాయిల చెల్లింపుపై నోరు విప్పని గుర్తింపు సంఘం.**
**మెస్సీ ఫుట్ బాల్ ఆటకు రూ 10 కోట్లు కేటాయిస్తే గుర్తింపు సంఘంలో చలనం లేదు.**
**కొత్తగూడెం ఏరియా వికేసీ పనులు కాంట్రాక్టు చేతిలోకి ..??**
**మెడికల్ బోర్డు నిలిచిపోతుంటే ఇంకా ఈ గుర్తింపు అవసరమా?**
**సింగరేణి పరిరక్షణకై అన్ని కార్మిక సంఘాలు ఏకంకండి!**
**సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ నేత విజయగిరి**



**కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్)**- 2024 25 ఆర్థిక సంవత్సరంలో పనిచేసి, ఉత్పత్తిలో భాగస్వాములై లాభాలు ఆర్జించి దిగిపోయిన కార్మికులకు రావలసిన బకాయిలు చెల్లింపులు ఆలస్యం యాజమాన్యం చేస్తుందని తక్షణమే చెల్లింపు చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కొత్తగూడెం బ్రాంచ్ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నెల తర్వాత దిగిపోయిన కార్మికులకు ఏఒక్క బకాయిలు 34% లాభాల వాటా కానీ పిఎఫ్ ఆర్ బోనస్ కానీ ఇన్ని నెలలు గడుస్తున్నా యాజమాన్యం దిగిపోయిన కార్మికులపై చిన్న చూపు చూస్తుందని ఆరోపించారు. అంతేగాక కార్మికుల కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే గుర్తింపు ఏఐటీయూసీ సంఘం కార్మికుల బకాయిల చెల్లింపుపై ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని వ్యాఖ్యాని ఇచ్చారు. గత సంవత్సరం ఆర్జించిన లాభాలు యాజమాన్యం మెస్సీ ఫుట్ ఆటకు పదికోట్లు పక్కా దారి మళ్లిస్తుంటే గుర్తింపు సంఘంలో చెలనంలేకుండ ఉందని ఆరోపించారు. మెడికల్ బోర్డులో ఇన్వాలిడేషన్ కాక ఇక తండ్రి కొడుకుల ఉద్యోగాలకు ఇక కాలం చెల్లినట్లే అని ఆయన ప్రశ్నించారు. అయితే బోర్డు అప్డే చేసుకున్న కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అన్ని కార్మిక సంఘాలు మీనా వేషాలకు పోకుండా సింగరేణి పరిరక్షణ కై సేవ్ సింగరేణి నినాదం తో అందరూ కలిసి ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని అన్నారు.

# నూతన వ్యవసాయ పరికరాల ప్రదర్శను రైతులు విజయవంతం చేయండి

**ఆదర్శ రైతు గాదె నర్సిరెడ్డి**



**బూర్గంపాడు, సూర్య (మేజర్ న్యూస్)** - మండలం పరిధిలోని సోంపల్లి గ్రామంలో కృషి విజ్ఞాన వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో డ్రోన్లతో వ్యవసాయ సాగు విధానాన్ని తెలుసుకునేందుకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆదర్శ రైతు గాదె నర్సిరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోంపల్లి గ్రామంలో బుధవారం మధ్యాహ్నం తన పొలంలో నూతన వ్యవసాయ పరికరాల విధానాల ప్రదర్శనను కృషి విజ్ఞాన కేంద్రం భరత్, ఏడిఏ తాతారావు పర్యవేక్షణలో డ్రోన్ల ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

# సింగరేణి సీఎండీగా డి.కృష్ణ భాస్కర్ బాధ్యతల స్వీకరణ



**కొత్తగూడెం సింగరేణి, సూర్య(మేజర్ న్యూస్)**- సింగరేణి సంస్థ ప్రస్తుత సీఎండీ ఎన్.బలరామ్ ఏడు సంవత్సరాల డిప్యూటేషన్ అనంతరం మాతృ విభాగానికి తిరిగి వెళుతున్న నేపథ్యంలో సింగరేణికి సీఎండీ (ఎఫ్ఏసీ)గా దేవరకొండ కృష్ణ భాస్కర్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఆయన సింగరేణి భవన్ లో బాధ్యతలు స్వీకరించారు.ఆయన ప్రస్తుత ఛైర్మన్ ఎన్. బలరామ్ నుండి బాధ్యతలను తీసుకున్నారు.ఆయనకు సింగరేణి డైరెక్టర్లు, జీఎంలు స్వాగతం పలికారు. డి.కృష్ణ భాస్కర్ 2012 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీగానూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.అలాగే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీగానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.గతంలో ఆయన రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు కలెక్టర్ గా విధులు నిర్వహించారు. తెలంగాణ ఇండస్ట్రీస్ శాఖకు డైరెక్టర్ గా, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖకు స్పెషల్ సెక్రటరీ గానూ వ్యవహరించారు.

# ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు రండి



**జిల్లా ప్రధాన న్యాయమూర్తిని ఆహ్వానించిన భద్రాచలం ఆలయ ఈవో**

**కొత్తగూడెం,సూర్య(మేజర్ న్యూస్)** - భద్రాచలంలో జనవరి 29, 30 తేదీల్లో జరగనున్న ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు ప్రత్యేక అతిథిగా హాజరుకావాలని కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌కు మంగళవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం కార్యనిర్వాహక అధికారి దామోదర్ రావు ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా కొత్తగూడెం జిల్లా కోర్టులోని ప్రధాన న్యాయమూర్తి చాంబర్‌లో ఆలయ ఈఓ దామోదర్ రావు, న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను సన్మానించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ముక్కోటి ఏకాదశి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఆలయంలో చేపడుతున్న ఏర్పాట్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా భద్రాచలం ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. భక్తులకు తాగునీరు, వసతి, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణతో పాటు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల సమన్వయంతో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను భక్తులు మెచ్చేలా ఘనంగా నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు.

# అంతరాలు లేని సమ సమాజాన్ని సాధించడమే ప్రభుత్వ లక్ష్యం

## -మధిర నియోజకవర్గ స్థానిక పోరులో విజయం సాధించిన కాంగ్రెస్ సర్పంచుల అభినందన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**మధిర, సూర్య మేజర్ న్యూస్:**
రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పటికే 85 శాతం స్థానాలు గెలుచుకుని కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని, ఇందిరమ్మ ప్రజా పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున దీవించి కాంగ్రెస్ నేతలను పెద్ద ఎత్తున గెలిపిస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం మధిర నియోజకవర్గ కేంద్రంలో తాజాగా గెలిచిన సర్పంచుల అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున స్థానాలు గెలుచుకొని విజయ దుందిబి మోగించి చరిత్ర సృష్టించారని, పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా అత్యంత ప్రజాసామిక పద్ధతిలో జరుగుతున్నాయని తెలిపారు. ఫలితాలు హర్షించదగిన రీతిలో వెల్లడి అయ్యాయని డిప్యూటీ సీఎం అన్నారు. ఎవరు సర్పంచులుగా గెలిచిన ప్రభుత్వం తరఫున న్యాయం చేస్తాం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు సమానంగా అభివృద్ధి చేస్తాం అన్నారు. ఈ విజయ దుందుభి లో కాంగ్రెస్ కార్యకర్తల కృషి పోరాటం అద్భుతమైనదని అన్నారు.



మొదటి విడతలో చేపట్టిన నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇల్లు, ప్రతి ఇంటికి ఐదు లక్షలు ఖర్చు చేస్తున్న తీరు, రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వారి పక్షాన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 8,600 కోట్లు ఆర్టీసీకి చెల్లించిందని ఆయన వివరించారు. రాష్ట్రంలో 1.15 లక్షల కుటుంబాలు ఉండగా అందులో 93 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని ఇందుకు గాను ప్రభుత్వం 13,500 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 85% మంది 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కింద ప్రయోజనం పొందుతున్నారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు ఇంటింటికి వెళ్లి చీరలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తున్నాం అన్నారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని తెలిపారు. దేశంలోనే అతి ఎక్కువ తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సాధించిందని అభివృద్ధి చెందిన గుజరాత్ లాంటి రాష్ట్రాలు కూడా తెలంగాణ లతో పోటీపడే పరిస్థితి లేదని డిప్యూటీ సీఎం అన్నారు. ఎక్కడ నదులకు ఆనకట్టలు కట్టాలి, ఏ ప్రాంతంలో రోడ్లు వేయాలి ఏ ప్రాంతంలో బుల్లెట్ ట్రైన్లు నడపాలి పరిశ్రమలు, విద్యాసంస్థలు, ఫార్మా, ఐటీ పార్కులు ఎక్కడ నెలకొల్పాలు అనేది విజన్ డాక్యుమెంట్ 2047లో వివరించామని తెలిపారు. 2017 కల్లా త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీని సాధించబోతున్నాం అందులో భాగంగా 1.39 లక్షల మెగావాట్ల విద్యుత్ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం, ఎలా అందించబోతున్నామో ఈజన్ డాక్యుమెంట్లో వివరించామని డిప్యూటీ సీఎం తెలిపారు. విజన్ డాక్యుమెంట్ విడుదల చేసిన గంటల వ్యవధిలోనే 5.75 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తరలివచ్చాయి, భవిష్యత్తులో రాష్ట్రంలోకి పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలి రానున్నాయని ఆయన తెలిపారు. మధిర నియోజకవర్గంలో 131 సర్పంచ్ స్థానాలకు గాను 90 స్థానాలకు పైగా కాంగ్రెస్ అభ్యర్థులు గెలుచుకొని రికార్డు సృష్టించారని 1983 నుంచి చూస్తే ఈ స్థాయిలో కాంగ్రెస్ అభ్యర్థులు ఎన్నడు కూడా ఇంత పెద్ద మొత్తంలో సర్పంచ్ స్థానాలు గెల్చుకోలేదని, తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు అద్భుత విజయాలు సాధించారని డిప్యూటీ సీఎం తెలిపారు.



ప్రతి సర్పంచ్ కూడా రాగద్వేషాలకు అతీతంగా పనిచేయాలని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేస్తే నాయకుడు కాలేడు అని డిప్యూటీ సీఎం వివరించారు. ఈరోజు నుంచే సర్పంచుల బాధ్యత మొదలైంది కేవలం వ్యవసాయమే కాదు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు విద్యా, వైద్య రంగాలపై సర్పంచులు దృష్టి సారించాలని నిత్యం సమీక్షించాలని తెలిపారు. పిల్లలు ఎంత బాగా చదువుకొని పైకి వస్తే వారు ఊరు గురించి అంత బాగా ఆలోచిస్తారని ఆయన తెలిపారు. సర్పంచులు పాఠశాలలను సందర్శించాలి అక్కడ బోధన ఎలా జరుగుతుంది వసతి సౌకర్యాలు ఎలా ఉన్నాయో సమీక్షించి ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దాలని తెలిపారు. విద్య, వైద్యం రంగాలపై సర్పంచులు ప్రత్యేకంగా దృష్టి సారించాలి ఈ రెండు అంశాలపై 24 గంటలు తాను అందుబాటులో ఉంటానని, ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా తనకు నేరుగా ఫోన్ చేయవచ్చు లేదా తన కార్యాలయ సిబ్బంది అందుబాటులో ఉంటారని డిప్యూటీ సీఎం తెలిపారు. అంతరాలు లేని సమ సమాజం సృష్టించడం, ప్రపంచంతో పోటీపడేలా రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవడమే ప్రజా ప్రభుత్వం ఎజెండా అని డిప్యూటీ సీఎం అన్నారు.

# సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను సందర్శించిన జిల్లా పోలీస్ కమిషనర్

## - నేడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు..





**సింగరేణి సూర్య మేజర్ న్యూస్**
సింగరేణి(కారేపల్లి డిసెంబర్ 16)సింగరేణి మండలంలోని నేడు మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సింగరేణి మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు.కారేపల్లో పోలింగ్ కేంద్రంలో బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలించారు.ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ప్రతి ఒక్కరు సమన్వయం పాటించాలని విజ్ఞప్తి చేశారు.ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని,శాంతియుత ఎన్నికల నిర్వహణకు అభ్యర్థులు,స్థానిక ప్రజలకు,రాజకీయ నాయకులు సహకారం అందించాలన్నారు.సెక్షన్ 163 BNSS యాక్ట్ అమల్లో ఉన్నందున ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, నిబంధన అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

# మహిళా ప్రాంగణం నందు యువతకు వివిధ శిక్షణ కార్యక్రమాలకు పెద్ద ఎత్తున అవకాశాలు



**ఖమ్మం (సూర్య బ్యూరో):**
ఖమ్మం జిల్లా మహిళా ప్రాంగణం, ఖమ్మం నందు నిర్వహించబడుతున్న వివిధ శిక్షణా కార్యక్రమాలకు సంబంధించి యువతకు పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించబడుతున్నాయి.ఈ సందర్భంగా 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు క్రింది పేర్కొన్న శిక్షణా కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేయబడుతుంది. ఈ శిక్షణలు పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించబడతాయి.కావున, ఈ క్రింది శిక్షణా కోర్సులు త్వరలోనే ప్రారంభించబడుతున్నందున అర్హత కలిగిన అభ్యర్థులు జిల్లా మహిళా ప్రాంగణ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలియజేయడమైనది.

**1. ప్రారంభించనున్న శిక్షణా కోర్సులు - అర్హతలు - వ్యవధి**

1.కమ్యూనిటీ హెల్త్ వర్కర్ (CHW)–2 నెలలు–10వ తరగతి ఉత్తీర్ణత
2.కంప్యూటర్–2 నెలలు–10వ తరగతి ఉత్తీర్ణత
3.టైలరింగ్–2 నెలలు–8వ తరగతి ఉత్తీర్ణత
4.బ్యూటీషియన్ –2 నెలలు –8వ తరగతి ఉత్తీర్ణత, కావున పై పేర్కొన్న శిక్షణా కోర్సులకు హాజరయ్యేందుకు ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా మహిళా ప్రాంగణం, ఖమ్మం నందు 20.12.2025 లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా ప్రాంగనాధికారిణి శ్రీమతి వేల్పుల విజేత ఒక ప్రకటన లో తెలియజేశారు. అదనపు వివరాల కోసం జిల్లా మహిళా ప్రాంగణ కార్యాలయాన్ని ప్రత్యక్షంగా సంప్రదించగలరు.

# నేడు పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి పర్యటన

## – కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన ప్రజాప్రతినిధులను కలవనున్న మంత్రి



**ఖమ్మం సూర్య బ్యూరో :**
తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బుధవారం పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కూసుమం చిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ఇటీవల ఎన్నికైన నూతన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కలుస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికైన ప్రజా ప్రతినిధులు అందరూ సకాలంలో హాజరుకావాలని కోరారు.అదేవిధంగా నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలకు కూడా మంత్రి అందుబాటులో ఉంటారని దయాకర్ రెడ్డి పేర్కొన్నారు.

# అద్దంకి రవిని పరామర్శించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డా. కోట రాంబాబు



**మధిర, సూర్య మేజర్ న్యూస్:**
మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికి ఇటీవలే చేతికి ఆపరేషన్ అవ్వగా మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డా. కోట రాంబాబు పరామర్శించారు. అతని ఆరోగ్య వివరాలు అడిగిర తెలుసుకుని వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కటికల సీతారాంరెడ్డి, ఎర్రగుంట రమేష్ తదితరులు వున్నారు.

# మంచికంటి గ్రామంలో ఎగిరిన సిపిఎం జెండా ఖమ్మం రూరల్

ఖమ్మం రూరల్ సూర్య మేజర్ న్యూస్ :



ఖమ్మం రూరల్ మండలం కాచిరాజుగూడెం గ్రామంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోసిపిఐ మద్దతుతో సిపిఎం జెండా ఎగిరింది. ఖమ్మం రూరల్ మండలంలో వామపక్షాల కలయిక తో గెలుపొందిన ఈ గ్రామం ఖమ్మం మాజీ శాసనసభ్యులు మంచికంటి రామకిషన్ రావు స్వగ్రామం కావడం ఇప్పుడు పెద్ద హాట్ టాపిక్ గా మారుతోంది. కొన్ని దశాబ్దాల పాటు ఇక్కడ ఎర్ర జెండా ను ఆదరించడం విశేషం. సర్పంచ్ గా ఎన్నికైన మాలోతు హరిని, వార్డు మెంబర్ గా ఎన్నికైన మురళి లను ఘనంగా సన్మానించిన రాజ్యాంగ పరిక్షణ వేదిక ఫౌండర్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలి. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ, బలపరిచిన సిపిఎం అభ్యర్థి మాలోతు హరి గ్రామ పంచాయతీ సర్పంచ్ గా ఎన్నికైన సందర్భంగా ఆర్ పి వి అధినేతను వరంగల్ క్రాస్ రోడ్ లోని ఆర్ పి వి కార్యాలయంలో కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులను ఘనంగా సన్మానించి భారీ మెజార్టీతో గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ఐదు సంవత్సరాలు ప్రజలు మన్ననలను పొందే విధంగా పాలన సాగించాలని కోరారు. ఎన్నికైన వారితో ఆర్పీవీ ఆఫీసు లో కలసిన సిపిఎం సీనియర్ నాయకులు అద్దంకి తిరుమలయ్య, సిపిఐ మాజీ ఎంపీటీసీ ఏలూరి భాస్కరరావు, కార్యదర్శి పొన్నం భాస్కరావు, సిపిఎం వార్డ్ సభ్యులు పొన్నం మురళి, జనార్దన్, మక్కాల వెంకన్న, ఎద్ల పల్లి వీరయ్య, కోటయ్య, నాగిరెడ్డి, కారుమంచి వెంకటేశ్వర్లు ,అద్దంకి వెంకటేష్, కారుమంచి గురవయ్య, తదితరులను ప్రత్యేకంగా అభినందించారు.

# విలువలతో కూడిన విద్యకు లైన్స్ క్వెస్ట్

## – విద్యార్థులను తీర్చిదిద్దేందుకు శిక్షణ .

సత్తుపల్లి మేజర్ సూర్య న్యూస్:



విద్యార్థులలో జీవన నైపుణ్యాలు పెంచటానికి,విద్యార్థుల సర్వతో ముఖ అభివృద్ధి ధ్యేయంగా "లైన్స్ క్వెస్ట్ " నిర్వహిస్తున్నట్లు శిక్షకురాలు కొండపల్లి రేణుక అన్నారు. సత్తుపల్లి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కేపిఆర్ గౌతమ్ మోడల్ స్కూల్ లో ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. సత్తుపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు గోగడ రమేష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రేణుక మాట్లాడు తూవిలువలతో కూడిన విద్య అందించాలనే లక్ష్యంతోఇంట్లో, బయట విద్యార్థుల ప్రవర్తనను మెరుగుపరచడం ద్వారా భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలనే లక్ష్యంతోఅనేక సంవత్సరాలుగా టీచర్లకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం ,స్నేహ సంబంధాలు, కుటుంబ సంబంధాలు , లక్ష్యాలు పెంపొందించడానికి రెండు రోజులపాటు ఉపాధ్యాయులకు జరిగే కార్యక్రమం శిక్షణ కార్యక్రమం వారికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యాక్రమానికి ప్రిసైడింగ్ ఆఫీసర్గా వ్యవహరించిన పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులను బాధ్యత గల పౌరులుగా తయారు చేయడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ప్రాంతంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, లైన్స్ క్లబ్ జిఈటి గవర్నర్ మందపాటి ప్రభాకర్ రెడ్డి, జంగా సత్యనారాయణ, పెనుగొండ రమేష్, ప్రిన్సిపల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# మధిర మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డిప్యూటీ సీఎం

## –సిబ్బంది, విధులు, నూతన కార్యాలయం భవన నిర్మాణం వివరాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం

మధిర, సూర్య మేజర్ న్యూస్:








డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మంగళవారం మధిర మున్సిపల్ కార్యాలయాన్ని ఆక స్మికంగా తనిఖీ చేశారు. సర్పంచుల అభినందన సభ అనంతరం ఆయన నేరుగా మున్సిపల్ కార్యాల యానికి వెళ్లారు. మున్సి పల్ కమిషనర్, కార్యాలయ సిబ్బందితో పలు అంశాలు చర్చించారు. మున్సిపల్ కార్యాలయం మొత్తం డిప్యూటీ సీఎం కలియ తిరిగారు. ప్రభుత్వ సిబ్బంది, కాంట్రాక్టు సిబ్బంది ఎంతమంది ఉన్నారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టు సిబ్బంది కి వేతనాలు ఎక్కడినుంచి చెల్లింపులు జరుగుతున్నాయి వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలన కింద వచ్చిన దరఖాస్తులు వాటిని పరిష్కరిస్తున్న తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత నూతన మున్సిపల్ కార్యాలయం భవన నిర్మాణానికి సంబంధించిన మ్యాప్ ను ఇంజనీరింగ్ అధికారులతో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయం పరిసరాల్లో పరిశు భ్రతను పరిశీలించారు.

# పంచాయతీలలో ఆదర్శమైన పాలన అందించాలి

## –మంత్రి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి

నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్



నూతనంగా ఎన్నికైన పంచాయతీ పాలకవర్గాలు ఆదర్శవంతమైన పాలన ను అందించాలని రాష్ట్ర రెవిన్యూ,గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి సూచించారు.మండలం లోని వివిధ పంచాయతీల నూతన పాలకవర్గాల సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.సర్పంచులు,వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ...తెలంగాణ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. పంచాయతీలలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడ్డ ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. మంత్రి శ్రీనివాసరెడ్డి చొరవ తో గ్రామాలను మరింత అభివృద్ధి చేసేందుకు కార్యచరణ ను రూపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొడాలి. గోవిందరావు కోనాయ గూడెం,మాజీ సర్పంచ్ పెంటమళ్ళ పుల్లమ్మ,తీగుళ్ల భవాని,పాకనాటి కన్నారెడ్డి, కొమ్మినేని విజయ్, చెరుకుపల్లి ఉపేందర్,కొత్తపల్లి ఆనందరావు,మండడి నాగ శ్రీను,చెరుకుపల్లి రాజేష్,తోట చలపతి, పాకనాటి సంగీత,మేకల అర్జున్,పిచ్చయ్య,తోట సురేష్,నాగేశ్వరరావు, కనక భాస్కర్,హరిమి మాధవి, శంకర్ రెడ్డి,తీగుళ్ల వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు జన్మదిన వేడుకలు

వైరా సూర్య ఆర్సి



వైరా. పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల.రంగారావు జన్మదిన వేడుకలు వైరాలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ ఉపాధ్యక్షులు బొర్రా. రాజశేఖర్ మరియు వైరా మున్సిపల్ మాజీ చైర్మన్ సూతకాని. జైపాల్ పాల్గొని జన్మదిన కేకును కట్ చేసి కట్ల రంగారావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. కట్ల రంగారావు పార్టీ సిద్ధాంతాల కోసం పరితపించే వ్యక్తి అని ఎన్ని వడిదడుగులు ఎదురైనా నిబద్ధతతో పార్టీని మరియు అతని నమ్ముకున్న కార్యకర్తల కోసం పరితపించే వ్యక్తి అని కొనియాడారు. క ట్ల. రంగారావు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు లభించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బీడీకే. రత్నం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ల నాగరాజు, రేచర్ల నాగేశ్వరరావు, సయ్యద్.అన్వర్ పాషా,గుత్తికొండ వీరబాబు, గుడిమల్ల రత్తయ్య, రేచర్ల సత్యం, మోహన్ రెడ్డి, అమర్లపూడి నవీన్, అబ్బూరి .కాంతయ్య, రేచర్ల ప్రభాకర్, రాచ బండి రామకృష్ణ, బండారు తిరుపతిరావు, సుగ్గల శ్రీను, మట్టపల్లి.సైదులు, కొమ్మూరి శ్రీను, రేచర్ల విశ్వనాథం, రేచర్ల చిన్ని, కట్ల శ్రీకాంత్, బండ్ల కృష్ణ, సుధాకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్‌కు సర్వం సిద్ధం

వేంసూరు సూర్య మేజర్ న్యూస్



వేంసూరు మండలంలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు.వేంసూరు మండల పరిషత్ కార్యాల ఆవరణం పక్కన ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామాగ్రి అందించారు. ఎన్నికల విధుల్లో మొత్తం514 మంది పాల్గొనన్నారు.222 మంది ప్రొసీడింగ్ అధికారులు, 23మంది రిటర్నింగ్ అధికారులు, నలుగురు జోనల్ అధికారులు, 13మంది రూట్ ఆఫీసర్లు, 252 మంది ఓ పి ఓ లు ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. 13 రూటు బస్సుల ద్వారా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది తరలి వెళ్లారు. మండలంలో 26 పంచాయతీలుగాను వైయస్ బంజర్, పల్లెవాడ, ఎర్రగుంటపాడు పంచాయతి ఏకగ్రీవంగా 23 గ్రామపంచాయతీలు, 214 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మండలంలో మొత్తం35531 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు17415మంది స్త్రీలు18116 మంది ఉన్నారు.

# ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి...



**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి..**
**- నేడు మూడవ విడత గ్రామ పంచాయతీ పోలింగ్ కు అన్ని ఏర్పాటు పూర్తి అధికారులు.**
**-నిబంధనల ప్రకారం ఎన్నికల సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలిలి జిల్లా కలెక్టర్**
**- నేటి ఉదయం 7 గంటల నుండి ఒంటి గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభం.**
**-సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్, సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ**
**-అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు**

**సింగరేణి సూర్య మేజర్ న్యూస్**

సింగరేణి(కారేపల్లి నవంబర్17) సింగరేణి మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన(డిస్ట్రిబ్యూషన్) ఓటు వేయటానికి సంబంధించిన సామాగ్రిని రిసెప్షన్ కేంద్రాలను తనిఖీ చేసి, ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ మూడవ విడత గ్రామాల్లో పోలింగ్ ఎలాంటి లోపాలు లేకుండా సమర్ధవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, తెలిపారు. ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.జిల్లాలో డిసెంబర్ 17న మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా సింగరేణి మండలం కారేపల్లి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలను మంగళవారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలలో బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ లో వినియోగించే ఎన్నికల సామాగ్రిని పరిశీలించారు. కేంద్రంలో ఆర్.వో. లు, పోలింగ్ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి చెక్ లిస్టు ఆధారంగా అందినదా లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని, పంచాయతీ ఎన్నికల్లో నిబంధనల ప్రకారం ఎన్నికల సిబ్బంది తమ విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని, ఎక్కడ ఎటువంటి వివాదాలు లేకుండా సజావుగా ఎన్నికలు జరిగేలా చూడాలని అన్నారు.డిసెంబర్ నేడు17 బుధవారం మూడవ విడతలో జిల్లా నందు ఏడు మండలాలు సత్తుపల్లి,వేంసూరు, పెనుబల్లి,కల్లూరు, తల్లాడ,సింగరేణి, ఏన్కూర్ పరిధిలో సర్పంచ్,వార్డు మెంబర్ స్థానాలకు పోలింగ్ జరుగుతుందని అన్నారు.పోలింగ్ ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందని, ఆ తర్వాత మధ్యాహ్నం రెండు గంటల నుండి కౌంటింగ్ నిర్వహిoచి, ఉప సర్పంచ్ ఎన్నిక పూర్తి చేసి ఫలితాలను వెల్లడిస్తామన్నారు.ఎన్నికల సిబ్బంది పోలింగ్ సరళిని,బ్యాలెంట్ పేపర్ ను బ్యాలెట్ డబ్బాలో ఓటర్ల వేసే విధానాన్ని ఖచ్చితంగా పరిశీలించాలని అన్నారు .ఎన్నికల సిబ్బంది ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పూర్తి నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని, జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా పూర్తిచేయాలని, ఎక్కడ తొందరపాటు లేకుండా ఆర్ఓ పూర్తి భాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు కల్పించామని వివరించారు .ప్రశాం తమైన శాంతియుతంగా ప్రశాంతంగా పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశామని,సీసీ కెమెరా ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని, సెన్సిటివ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లు నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. పల్లె గ్రామ పంచాయతీ పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలనే ఉద్దేశంతో లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ప్రజాస్వామ్యం ద్వారా లభించిన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించాలని అన్నారు.గ్రామంలో ప్రతి ఒక్క ఓటు విలువైనదని, ఓటర్లు అందరూ నిర్ణీత సమయానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చి,ఎవరి ప్రభావానికి లోను కాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని కలెక్టర్ అన్నారు.పోలింగ్ సిబ్బంది,అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు.పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, తాగునీరు,కూర్చునే ఏర్పాట్లు,ప్రత్యేక అవసరాలున్న ఓటర్లకు సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జడ్పీసిఈవో దీక్షారైనా, మండల ప్రత్యేక అధికారులు రాజేశ్వరి, చందన్ కుమార్, సింగరేణి మండల తహసీల్దార్ రమేష్, యంపిడివో శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.











# తండ్రి అంత్యక్రియలు నిర్వహించిన కూతురు

**సత్తుపల్లి మేజర్ సూర్య న్యూస్:**

తండ్రి తన కూతురే అంత్యక్రియలు నిర్వహించాలనే తన చివరి కోరికను కూతురు నేరవేర్చారు .ఈ సంఘటనకు సంబంధించి ఆయన కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం సత్తుపల్లి వాస్తవ్యులు ఓరుగు పుల్లయ్య (75) వయోభారంతో కూడిన అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు.ఆయనకు మగ సంతానం లేకపోవడంతో కొడుకే కర్మకాండలు నిర్వహించాలనే సాంప్రదాయానికి భిన్నంగా ఆయన కోరిక మేరకు తన పెద్దకూతురు దుబ్బల కృష్ణవేణి తానే కర్మకాండలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బంధువులు,మిత్రులు పాల్గొన్నారు.



# వైరాలో ఘనంగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు జన్మదిన వేడుకలు





**వైరా రూరల్ (సూర్య న్యూస్):-** పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల. రంగారావు జన్మదిన వేడుకలు వైరాలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహిoచారు.ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ ఉపాధ్యక్షులు బొర్రా. రాజశేఖర్,మున్సిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్ పాల్గొని జన్మదిన కేకును కట్ చేసి కట్ల రంగారావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. కట్ల రంగారావు పార్టీ సిద్ధాంతాల కోసం పరితపించే వ్యక్తి అని ఎన్ని వడిదడుగులు ఎదురైనా నిబద్ధతతో పార్టీని అతన్ని నమ్ముకున్న కార్యకర్తల కోసం పరితపించే వ్యక్తి అని కొనియాడారు.కట్ల రంగారావు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు లభించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బీడీకే. రత్నం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ల నాగరాజు, రేచర్ల నాగేశ్వరరావు,సయ్యద్ అన్వర్ పాషా,గుత్తికొండ వీరబాబు, గుడిమల్ల రత్తయ్య, రేచర్ల సత్యం, మోహన్ రెడ్డి, అమర్లపూడి నవీన్, అబ్బూరి .కాంతయ్య, రేచర్ల ప్రభాకర్, రాచ బండి రామకృష్ణ, బండారు తిరుపతిరావు, సుగ్గల శ్రీను, మట్టపల్లి.సైదులు, కొమ్మూరి శ్రీను, రేచర్ల విశ్వనాథం, రేచర్ల చిన్ని, కట్ల శ్రీకాంత్, బండ్ల కృష్ణ, సుధాకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల బాధ్యతలో తల్లి .... తండ్రి లాలనలో చంటి పాప

**పెనుపల్లి సూర్య మేజర్ న్యూస్...**

మూడవ విడత రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల సిబ్బందిని కేటాయించారు. నేడు జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఆయా విభాగాలలో కేటాయించిన సిబ్బందిని సిద్ధం చేశారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటుచేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు. అందులో ఖమ్మం నుండి ఎన్నికల విధులు పెనుబల్లి మండలం కేటాయించడంతో ఓ ఉద్యోగిని చంటి పిల్లవాడుతో హాజరు అయ్యారు. భార్య ఎన్నికల విధుల్లో ఉండగా భర్త చంటి పాప బాధ్యతలు తీసుకున్నాడు.ఆ జంటను చూసి ఎన్నికల విధులకు రాకుండా ఉంటే బాగుండేదిగా అని పలువురు వ్యాఖ్యానించారు. కానీ ఎన్నికల నిర్వహణలో అనారోగ్య కారణాలు ఉంటేనే ఎన్నికల విధుల్లో మినహాయింపు ఉంటుంది. ఆమెకి మండలంలో ఓ పంచాయతీలో విధులు కేటాయించడంతో భార్యాభర్తలు ఇద్దరూ చంటి పిల్ల వాడిని భుజానవేసుకుని విధులకు హాజరయ్యేందుకు వెళ్లారు. మంగళవారం రాత్రి బుధవారం మొత్తం బాలుని తండ్రి సంరక్షణ లో చూసుకోవాల్సి ఉంది. బుధవారం సాయంత్రం ఎన్నికల సామాగ్రి స్వాధీనం చేసేంతవరకు తండ్రి లాలనలో చంటిపాప ఉండవలసిందే.



# సింగరేణి ఆర్థిక శాఖలో అడ్డగోలు ప్రమోషన్లపై నిరసనలు.!



**- సింగరేణిలో 'సైక్లోన్' సృష్టిస్తున్న" ఈ 8" పదోన్నతి...!?**

**- ప్రమోషన్లపై ఆఫీసర్లలో ఆగ్రహ జ్వాలలు**

**కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్)-**
సింగరేణి కాలరీస్ కంపెనీ లో "ఈ 8" స్థాయి పదోన్నతుల వ్యవహారం పెను తుఫానుగా మారుతోంది. ఆర్థిక, అకౌంట్స్ విభాగంలో ఒక అధికారికి ఇచ్చిన ప్రమోషన్, సంస్థాగత నియమ నిబంధనలు, నైతిక విలువలు, సీనియారిటీని ధిక్కరించిందనే ఆరోపణలతో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఏకంగా ఏడుగురు సమర్థులైన, నిజాయితీపరులైన సీనియర్ అధికారులను పక్కన పెట్టి మరీ ఈ పదోన్నతి కట్టబెట్టడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

**- నియమాలను ఉల్లంఘించిన అపాత్రుల ప్రమోషన్**

ఈ మొత్తం వివాదానికి కేంద్ర బిందువైన అధికారి, ఆర్థిక విభాగంలో ఈ-7 గ్రేడ్ (డిప్యూటీ జనరల్ మేనేజర్) లో ఉన్నారు. గత నెల వరకు అత్యంత కీలక, ఉన్నత స్థానంలో ఉన్న ఒక డైరెక్టర్‌కు ఆమె 'స్టాఫ్ ఆఫీసర్'గా పనిచేస్తున్నారని తెలుస్తోంది.
ముఖ్యంగా, 2019 నుంచి దాదాపు ఆరేళ్లకు పైగా ఆమె ఒకే బాస్ కింద పనిచేయడం, గత ఆరేళ్ళ అధికారి పనితీరు అంచనా నివేదిక ( పి ఎ ఆర్)ను అదే అధికారి రాయడం గమనార్హం. అంతేకాకుండా, అధికారి జీవిత భాగస్వామి కూడా అదే విభాగంలో జనరల్ మేనేజర్ స్థాయిలో అధికారిగా ఉండడం ఈ మొత్తం వ్యవహారంలో పక్షపాతానికి తావిచ్చిందనే విమర్శలకు బలం చేకూరుస్తోంది.

**-నిబంధనలు ఏం చెబుతున్నాయి? నిబంధనల ఉల్లంఘన ఎలా జరిగింది?**

సింగరేణి పదోన్నతి నియమావళి ప్రకారం, ఒక అధికారికి నిరంతరంగా మూడు సంవత్సరాలు 'అత్యుత్తమ (ఔట్ స్టాండింగ్) పి ఎ ఆర్ రేటింగ్‌లు ఉండి, వాటిలో కనీసం రెండు వేర్వేరు బాస్‌ల నుండి వచ్చి ఉంటే, అప్పుడు సీనియర్లను పక్కనపెట్టి పదోన్నతికి పరిగణించే అవకాశం ఉంటుందని తెలుస్తోంది .అయితే, నియమాలు స్పష్టంగా 'మెరిట్ కమ్ సీనియారిటీ' (యోగ్యతతో కూడిన సీనియారిటీ) ని ప్రామాణికంగా పేర్కొంటున్నాయని చెప్పవచ్చు. మెరిట్ అనేది పదోన్నతికి ఏకైక ప్రాతిపదిక కాకూడదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.ప్రస్తుత కేసులో, పి ఎ ఆర్ రాసే అధికారి, అదే పి ఎ ఆర్ ఆమోదించే అధికారి, డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) చైర్మన్, చివరికి పదోన్నతిని ఆమోదించే అధికారి కూడా ఒకే బాస్ కావడం అత్యంత వివాదాస్పదంగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి.ఇది పారదర్శకతకు పాతరేసి, ఏకపక్ష నిర్ణయాలకు దారితీసిందనడంలో సందేహం లేదు.

**-సమర్థులకు అన్యాయం... సి ఎ నిపుణులను పక్కనపెట్టి..!?**

పక్కన పెట్టబడిన ఏడుగురు సీనియర్ ఆఫీసర్లు కూడా అత్యంత సమర్థులుగా అదే శాఖలో పనిచేస్తున్న ఉన్నతాధికారులు సైతం అంగీకరిస్తారు . వీరు కేవలం అత్యుత్తమ రేటింగ్‌లు పొందడమే కాక, వారిలో చాలా మంది చార్టెడ్ అకౌంటెంట్లు ( సిఏ ) వంటి వృత్తిపరమైన అర్హతలు కలిగి ఉన్నారని తెలుస్తోంది. విశేషమేమిటంటే, పదోన్నతి పొందిన అధికారిణికి "సి ఎ" అర్హత లేదన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. సీనియర్లు వేర్వేరు విభాగాల్లో, వేర్వేరు బాస్‌ల కింద పనిచేస్తూ తమ అత్యుత్తమ ప్రతిభను నిరూపించుకుంటే, ఒకే అధికారి దయతో పదోన్నతి దక్కడం సింగరేణిలో వృత్తి నైపుణ్యాన్ని అవమానించడమేనని అధికారులు వాపోతున్నారు.ఈ అన్యాయం కేవలం ఆర్థిక శాఖలోనే కాక, సింగరేణిలోని అన్ని విభాగాల అధికారులలో తీవ్రమైన నిరాశను, కోపాన్ని రేకెత్తించింది. ఈ అడ్డగోలు పక్షపాతంపై ఇప్పటికే డైరెక్టర్ (పా) దృష్టికి ఫిర్యాదు అందిందని తెలుస్తోంది.సింగరేణి బొగ్గు బెల్టు అంతటా చర్చనీయాంశంగా మారిన ఈ వ్యవహారంలో, భవిష్యత్తులో ఇలాంటి అనైతిక పక్షపాతాలు పునరావృతం కాకుండా డైరెక్టర్ (పా) ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే. నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసిన తమ సీనియారిటీ, అత్యుత్తమ పనితీరును నిర్లక్ష్యం చేయడంపై అధికారులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఇది ఉద్యోగుల నైతిక స్థైర్యాన్ని దారుణంగా దెబ్బతీస్తోందని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.

# ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలి

**-అడిషనల్ డీసీపీ లా & అర్డర్**






**ఖమ్మం (సూర్య బ్యూరో):**
మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పక్రియ ముగిసే వరకు పోలీస్ సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీసీపీ లా&అర్డర్ ప్రసాద్ రావు అన్నారు.పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు కల్లూరు, తల్లాడ మండలాల ఎన్నికల సందర్భంగా పోలీస్ బందోబస్తు సిబ్బంది యొక్క విధివిధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ..గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతం చేయడానికి పోలీస్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల విధులలో ఎవరైనా నిర్లక్ష్యం వహించినా, నిబంధనలను ఉల్లంఘించినా శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. విధినిర్వహణలో సిబ్బందికి ఏదైనా ఇబ్బందులు, ఆకస్మిక సమస్యలు ఎదురైతే, వెంటనే ఉన్నత అధికారులకు సమాచారం అందించాలని, వ్యక్తిగతంగా నిర్ణయాలు తీసుకోవద్దని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావలిని ఖచ్చితంగా పాటిస్తూ..ఎన్నికల విధులలో ఎలాంటి అలసత్వం లేకుండా క్రమశిక్షణతో తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

# ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం....

**-ఆలయ మేనేజర్ పాకల వెంకటరమణ...**



**అన్నపురెడ్డిపల్లి, సూర్య( మేజర్ న్యూస్)-**
మండల కేంద్రంలోని ప్రముఖ వైష్ణవాలయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళ వారం ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయని ఆలయ మేనేజర్ పాకల వెంకటరమణ తెలిపారు.గోదాదేవి అమ్మవారికి అభిషేకాలు, ధనుర్మాస ప్రత్యేక పూజలు చేశారు అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ప్రతాపురం ప్రసాదాచార్యులు తిరుప్పావై పాశురాలు పట్టించారు. ఈ సందర్భంగా ఆలయ మేనేజర్ మాట్లాడుతూ ఆలయంలో జనవరి 15వ తేదీ వరకు ధనుర్మాస మాస ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం తిరుప్పావై పాశురాలు పట్టించాడం, గోదాదేవి రంగనాథుల స్వామి గ్రామ సేవ, నిర్వహిస్తామని. ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా డిసెంబర్ 30వ తేదీ వైకుంఠ ఏకాదశి ని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం, జనవరి 15వ తేదీ గోదారంగనాథుల కళ్యాణం మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ ధనుర్మాస ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

# శాంతియుత ఎన్నికలే లక్ష్యం : అడిషనల్ డీసీపీ రామానుజం





**ఖమ్మం (సూర్య బ్యూరో):**
శాంతియుత ఎన్నికలే లక్ష్యంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బాధ్యతలు నిర్వహించాలని అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రామానుజం అన్నారు.
ఏన్కూరు మండలం పరిధిలో మూడో విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది యొక్క విధివిధానాలపై అవగాహన కార్యక్రమం ఏన్కూర్ పోలీస్ స్టేషన్ లో నిర్వహించారు.ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ....గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతం చేయడానికి పోలీస్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు.
ఎన్ని కల విధులలో ఎవరైనా నిర్లక్ష్యం వహించినా, నిబంధనలను ఉల్ల ంఘించినా శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. విధినిర్వహణలో సిబ్బందికి ఏదైనా ఇబ్బందులు, ఆకస్మిక సమస్యలు ఎదురైతే, వెంటనే ఉన్నత అధికారులకు సమాచారం అందించాలని, వ్యక్తిగతంగా నిర్ణయాలు తీసుకోవద్దని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావలిని ఖచ్చితంగా పాటిస్తూ..ఎన్నికల విధులలో ఎలాంటి అలసత్వం లేకుండా క్రమశిక్షణతో తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

# మూడో విడత ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి: కల్లూరు ఏసీపీ





**ఖమ్మం (సూర్య బ్యూరో):**
మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ అన్నారు.పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు సత్తుపల్లి, సత్తుపల్లి రూరల్ మండలం ఎన్నికల సందర్భంగా పోలీస్ బందోబస్తు సిబ్బంది యొక్క విధివిధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతం చేయడానికి పోలీస్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు.ఎన్నికల ప్రవర్తన నియమావలిని ఖచ్చితంగా పాటిస్తూ.. ఎన్నికల విధులలో ఎలాంటి అలసత్వం లేకుండా క్రమశిక్షణతో తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పోలింగ్ అనంతరం జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, సెక్షన్ 163 BNSS యాక్ట్ ఆంక్షలు అమల్లో ఉన్నందున నిబంధన కచ్చితంగా పాటించాలని అన్నారు.

# ఖమ్మం జిల్లాలో పరిశ్రమల విస్తరణకు వేగవంతమైన చర్యలు...

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**-రఘునాథపాలెం మండలం పరిధిలో టిజిఐఐసి కి కేటాయించిన స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్**





**ఖమ్మం (సూర్య బ్యూరో):**

జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం రఘునాథపాలెం మండలం జింకల తండా, పువ్వాడ నగర్ పరిధిలో తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల మౌళిక వసతుల అభివృద్ధి సంస్థ (టిజిఐఐసి) కు కేటాయించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. పరిశ్రమలు నెలకొల్పడానికి స్థలం అనుకూలమైన పరిస్థితులను క్షేత్రస్థాయిలో కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కేటాయించిన భూమి యొక్క విస్తీర్ణం, సరిహద్దులు, రహదారి అనుసంధానం, మౌళిక సదుపాయాల లభ్యతను సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించారు. ప్రస్తుతం ఉన్న మొత్తం స్థలంను సేత్వార్, కాస్రా, నక్షా మ్యాప్ లను ఆధారంగా సమగ్రంగా సర్వే చేసి సరిహద్దులు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లాను పరిశ్రమలకు అనుకూల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తున్నదని, టిజిఐఐసి ద్వారా కేటాయించిన భూములను సమర్థవంతంగా వినియోగించి ఆర్థిక అభివృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మైనింగ్ ఎడీ సాయినాథ్, పరిశ్రమల శాఖ జీఎం సీతారాం నాయక్, ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, రఘునాథపాలెం మండల తహసీల్దార్ శ్వేత, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్‌లో మరికొన్ని పరిశ్రమలు

**సూర్య ప్రతినిధి ఖమ్మం**

జిల్లాలోని బుగ్గపాడుఫుడ్ పార్క్ పురోగతి పై పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు గారితో కల్సి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాదులో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఫుడ్ పార్క్ లో మౌలిక సదుపాయాలు కల్పన వేగంగా జరిగేలా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఫుడ్ పార్క్ లో 615 కోట్లు ఆక్వా ప్రాజెక్ట్ పెట్టుబడులు పెట్టనున్న దీపక్ నెక్స్ జెన్ గ్రూఫ్ గతంలో బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ కు రూపకల్పన చేసిన తుమ్మల 2016 లో శంకుస్థాపన గత ప్రభుత్వంలో పడావు పడ్డ ఫుడ్ పార్క్ రోడ్ రైల్వే పోర్ట్ కనెక్టివిటీ ఉండేలా స్ట్రాటజిక్ లొకేషన్ లో ఫుడ్ పార్క్.వ్యవసాయ ఉద్యాన ఆక్వా పౌల్ట్రీ రంగాలకు కీలకంగా మారనున్న ఫుడ్ పార్క్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎంప్లాయిమెంట్ హబ్ గా మారనున్న బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ మెగా ఫుడ్ పార్క్ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పీ. ఎం కె.ఎస్ వై పథకంలో భాగంగా సత్తుపల్లి మండలం బుగ్గపాడు లో 2016 ఫిబ్రవరి 5 వ తేదీన ఆమోదం తెలిపారు. 60 ఎకరాల విస్తీర్ణంలో ఫుడ్ పార్క్.పొలం నుంచి మార్కెట్ వరకు ఉత్పత్తుల విలువ పెంచే విధంగా ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల కోసం కోర్ ప్రాసెసింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సి పిసి హబ్ గా ఫుడ్ పార్క్ ఏర్పాటు ఉద్దేశ్యంమొత్తం ప్రాజెక్ట్ వ్యయం 109 కోట్లు అందులో 99 కోట్లు ప్రాజెక్ట్ వ్యయం కాగా మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ నుంచి 28 కోట్లు గ్రాంట్ ఇచ్చారు. ప్రస్తుతం 26 ఎకరాల్లో 26 ప్లాట్స్ లో పలు కంపెనీలకు ప్లాట్స్ కేటాయించారు. గొర్లాస్ గ్రీన్ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ...ఇన్ఫినిటీ ఇండస్ట్రీస్ లకు ప్లాట్స్ కేటాయించారు. తాజాగా దీపక్ నెక్స్ జెన్ ఆక్వా ప్రాజెక్ట్ కు స్థలం కేటాయించారు. 615 కోట్లు





దీపక్ నెక్స్ జెన్ పెట్టుబడులు తో 3200 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

**గత ప్రభుత్వంలో పడావు పడ్డ ఫుడ్ పార్క్**

పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తో కలిసి ఇప్పటికే రెండు దఫాలు సమీక్ష నిర్వహించారు. ఈరోజు జరిగిన సమావేశంలో అనుమతులు వేగవంతం చేసి, సంక్రాంతి నాటికి ఫుడ్ పార్క్ ప్రారంభం చేయాలని సంబధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు....స్ట్రాటజిక్ లొకేషన్ లో మెగా ఫుడ్ పార్క్ రూపకల్పన చేసిన మంత్రి తుమ్మల .... యువత ఉపాధికల్పనకు కేరాఫ్ గా మారనున్న బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ పాలన అనుభవం కలిగిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు వ్యవసాయ రంగంలో ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ కు బాటలు వేసి తనదైన ముద్ర వేశారు. వ్యవసాయ ఉద్యాన పంటలకు సత్తుపల్లి అశ్వారావు పేట ప్రాంతాలు కేరాఫ్ గా ఉన్నాయి. దాంతో రైతాంగానికి మేలు చేసేలా పంట ఉత్పత్తులకు విలువ ఆధారిత మార్కెట్ పెంచేలా అగ్రి బై ప్రొడక్ట్స్ పరిశ్రమల స్థాపన జరిగేలా ఫుడ్ పార్క్ కు రూపకల్పన చేసారు

# బోదులబండ సర్పంచ్ విజయం పాలేరు గర్వకారణం : దయాకర్ రెడ్డి

**ఖమ్మం (సూర్య బ్యూరో):**



నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన కట్టెకోల నాగార్జున మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి నాగార్జునను శాలువాతో సత్కరించి హృదయపూర్వకంగా అభినందించారు. ఇప్పటివరకు జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అత్యధికంగా 1505 ఓట్ల మెజారిటీ సాధించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ సత్తా ఏంటో నాగార్జున నిరూపించారని దయాకర్ రెడ్డి ప్రశంసించారు. ఈ ఘన విజయం పాలేరు నియోజకవర్గానికి, ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి గర్వకారణమని తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజాసేవలో నాగార్జున ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొడాలి గోవింద్ రావు, మీసా నాగేశ్వరరావు, మీసా ముత్తయ్య, పొట్టపింజర రవి, ఎస్.కె. ఖాజామియా, అహ్మద్, అనంతు కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 18 నుంచి 22 వరకు రేషన్ షాపులలో బియ్యం లభ్యం...

**-అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

**-రేషన్ షాపులలో బియ్యం లభ్యతపై పత్రిక ప్రకటన విడుదల చేసిన అదనపు కలెక్టర్**




**ఖమ్మం (సూర్య బ్యూరో):**

డిసెంబర్ 18 నుంచి 22 వరకు రేషన్ షాపులలో బియ్యం లభ్యత ఉంటుందని, లబ్ధిదారులు బియ్యం పొందాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోర్టబిలిటీ బియ్యం సంబంధించి ఖమ్మం జిల్లాకు 446.282 మెట్రిక్ టన్నులు కేటాయించడం జరిగిందని, ఈ బియ్యాన్ని చౌక ధరల దుకాణాలకు సరఫరా చేసామని, రేషన్ లబ్ధిదారులు డిసెంబర్ 18 నుంచి డిసెంబర్ 22 వరకు వారికి సమీపంలో గల చౌక ధరల దుకాణాల (రేషన్ షాపుల) నుంచి పోర్టబులిటి ద్వారా బియ్యం పొందాలని అన్నారు. ఇట్టి విషయంలో లబ్ధిదారులు ఎటువంటి ఆందోళన చెందవద్దని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సర్టిఫికెట్లను పంపిణీ చేసిన 24వ డివిజన్ కార్పోరేటర్ కమర్తపు మురళి







**ఖమ్మం (సూర్య బ్యూరో):**

24వ డివిజన్ లో సెయింట్ మేరీస్ స్కూల్ నందు జన శిక్షణ సంస్తాన్ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం లో 56మంది మహిళాలకి 60 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి 24వ డివిజన్ కార్పోరేటర్ , తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు శ్రీ కమర్తపు మురళి చేతుల మీదుగా కుట్టు మిషన్ సర్టిఫికెట్లను పంపిణీ చేయడం జరిగింది . ఈ కార్యక్రమం లో జన శిక్షణ సంస్తాన్ డైరెక్టర్ రాధ కృష్ణ ,ట్రైనింగ్ టిచర్ శాంతి , బ్యూటీషియన్ స్రవంతి మరియు డివిజన్ నాయకులు గంగిశెట్టి శ్రీనివాస్ , షేక్ గౌస్ , సురపానేని సురేష్ , పొలురి నాగార్జున , మరికంటి రామకృష్ణ , మహిళ నాయకురాలు రేఖ భార్గవి , మరికంటి అనూష , యలమద్ది లక్ష్మి పాల్గొన్నారు.

# నేలకొండపల్లి మండలం గ్రామ సర్పంచ్‌లు వీరే!


శీలం వెంకటలక్ష్మి ,బిఆర్ఎస్, నేలకొండపల్లి మండలం
తేజావత్ శివాజీ ,కాంగ్రెస్, అజయ్ తండ
కొలిక పొంగు ఉప్పలమ్మ ఇండిపెండెంట్ ఆచార్లగూడెం
తేజావత్ సైదులు కాంగ్రెస్ కట్టు కాసారం
మల్లెపాటి కృష్ణవేణి ఇండిపెండెంట్
దుద్దుర్ల పవన్ ,కాంగ్రెస్, రామచంద్రపురం
నునావత్ కళావతి, కాంగ్రెస్, కొత్త కొత్తూరు
గుండపనేని లక్ష్మీనారాయణ ,కాంగ్రెస్ భైరవుని పల్లి
రాయపూడి రామారావు, కాంగ్రెస్, రాజారాంపేట
పొట్టా లక్ష్మి అమ్మగూడెం,ఇండిపెండెంట్
బట్ట పోతుల నాగమణి, కాంగ్రెస్, చెన్నారం
రావెళ్ల జ్యోతి, కాంగ్రెస్, గువ్వల గూడెం
కట్టెకోల నాగార్జున రావు, కాంగ్రెస్, బోదుల బండ
వడ్డే విజయ ,కూటమి ,ఆరెగూడెం
కోటి విజయ బి ఆర్ ఎస్ కోణాయి గూడెం
బొడ్డు వసంత, బి ఆర్ ఎస్, ముజ్జు గూడెం
ఏలూరి రామారావు, సిపిఎం ,ముఠాపురం
కామదానం ప్రవీణ్ ,బిఆర్ఎస్, తిరుమలపురం తండా
దండా రంగయ్య ,బిఆర్ఎస్, రాజేశ్వరపురం
బొడ్డు రాంబాబు ,కాంగ్రెస్, సిపిఎం ,ఉమ్మడి
కుక్కల నాగరాజు ,కాంగ్రెస్, పైనంపల్లి
బోయిన వేణు ,కాంగ్రెస్, రాయి గూడెం
గడిపల్లి సుజాత, కాంగ్రెస్ ,సుర్దేపల్లి
ధారావత్ సరోజిని బిఆర్ఎస్ ,శంకరగిరి తండా .
మేళ్లచెరువు సత్యం, కాంగ్రెస్ ,బుద్ధారం
భూక్య మౌనిక, కాంగ్రెస్, నాచేపల్లి
పాలపాటి సురేష్, కాంగ్రెస్, సదాశివపురం
అశోక్ రాణి ,కాంగ్రెస్, మంగాపురం తండా
మన్నే రాజశ్రీ, కాంగ్రెస్ ,అప్పల నర్సింహాపురం











# గడపగడపకు కాంగ్రెస్ పార్టీ

ఖమ్మం (సూర్య బ్యూరో):


నూతనంగా ఖమ్మం నగర అధ్యక్షుడిగా ఎన్నిక కాబడిన నాగ%శీ%ల్ల దీపక్ చౌదరి గత నెల రోజుల నుంచి కరుడు కట్టిన కాంగ్రెస్ పార్టీ నాయకుడికి సేవకుడికి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పదవి వచ్చిన సందర్భంగా ఏ డివిజన్లో కార్యకర్తలకు నాయకులకు కలవడానికి పోతుంటే ఎదురుగా వెళ్లి ఘనంగా స్వాగతం పలుకుతున్నారు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు బ్రహ్మరథం పడుతున్నారు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 10:00 వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు యూత్ నాయకులు ఎదురుగా వెళ్లి ఘనంగా స్వాగతం పలుకుతున్నారు 52 డివిజన్లో యూత్ కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ ఖలీల్ గారు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టేట్ మాజీ కన్వీనర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి ఫజల్ గారు యూత్ కాంగ్రెస్ ఖమ్మం జిల్లా వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ ఖలీల్ గారు వారి ఆధ్వర్యంలో దీపక్ చౌదరి గారికి ఘనంగా స్వాగతం పలికారు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయం శాఖ మంత్రి గారు తుమ్మల నాగేశ్వర రావు గారు వారి ఆశీస్సులతో యంగ్ డైనమిక్ పవర్ ఆఫ్ ది లీడర్ తుమ్మల యుగంధర్ బాబు గారు వారి సూచనలతో అన్ని డివిజన్లో కార్యకర్తలు కష్టాలు నాయకులు సమస్యలు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు వారి సమస్యలు తెలుసుకోవాలని పతి కార్యకర్తలకు నాయకులకు కలుస్తున్నారు మీ అభిమానం చూస్తా ఉంటే మీ అన్ని విధాలుగా 24




గంటలు ఏ టైం వచ్చినా అందుబాటులో ఉంటానని మీ సమస్యల కోసం మంత్రిగారికి తుమ్మల నాగేశ్వర్ రావు గారికి యుగంధర్ బాబు గారికి మీ సమస్యలు తీసుకుపోయి మీ సమస్యలు పరిష్కారం చేస్తావని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఖలీల్ గారు ఎండి ఫజల్ గారు నరాల నరేష్ మోహన్ నాయుడు గారు సంగయ్య । కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ సిటీ మాజీ చైర్మన్ డి వెంకట్రావు నాయక్, ఈ కార్యక్రమంలో ఖలీల్,అల్లాద్దీన్, బాజీ ,విజయ్,గణేష్, ఆసిఫ్,ఉదయ్ శ్రవణ్,ఇస్మాయిల్,నితిన్,యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన సర్పంచులు గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలి

:- కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్





వైరా రూరల్ (సూర్య న్యూస్):-

ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలి చిన కాంగ్రెస్ పార్టీ సర్ప ంచులు మంగళవారం పార్టీ జిల్లా మాజీ అధ్యక్షు లు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ వారిని శాలువాలతో సత్కరించి అభినందించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రతి సర్పంచ్ గ్రామాల అభివృద్ధి కోసం పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని ప్రతి గ్రామాలను కాంగ్రెస్ పార్టీ హయాంలో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు.తమ వంతు సహకారం ఎల్లవేళలా అందిస్తామని అన్నారు. మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో మండల పరిధిలోని ఖానాపురం గ్రామానికి చెందిన సర్పంచ్ భూక్య బాలాజీ, కామేపల్లి మండలం టేకుల తండాకు చెందిన సర్పంచ్ జర్పుల రెడ్డి,తాళ్లగూడెం గ్రామానికి చెందిన సర్పంచ్ లకావత్ సునీత లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, మైనార్టీ కార్యదర్శి షఫీ, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మతి స్థిమితం లేని వ్యక్తిని చేరదీసి ఆరోగ్య వంతునిగా చేసి కుటుంబ సభ్యులకు అప్పగించిన అన్నం సేవా ఫౌండేషన్

ఖమ్మం సూర్య (మేజర్ న్యూస్):

సూర్యాపేట జిల్లా మోతే మండల కేంద్రానికి చెందిన దేశ బోయిన శ్రీను సుమారు వయసు 35 సంవత్సరాలు.గత తొమ్మిది సంవత్సరాలుగా మతిస్థిమితం కోల్పోయి ఇంట్లో నుండి వెళ్లిపోయి వివిధ ప్రాంతాల్లో తిరిగి,ఈ మధ్యకాలంలో ఖమ్మం వైరా రోడ్ లో తిరుగుచుండగా స్థానిక ప్రజలు అన్నం ఫౌండేషన్ కి ఇచ్చిన సమాచారం మేరకు అన్నం ఫౌండేషన్ ఇటీవల ఆ మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసి ఆశ్రమానికి తరలించి విచారించగా నా పేరు దేశ బోయిన శ్రీను మాది సూర్యాపేట జిల్లా మోతే మండల కేంద్రానికి చెందిన వ్యక్తిని మా నాన్న పేరు దేశ బోయిన వెంకన్న అని తెలిపాడు.అన్నం ఫౌండేషన్ అంబులెన్స్ లో ఖమ్మం నుండి మోతే పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్లి అక్కడి పోలీసుల ముందు హాజరు పరచి,పోలీసుల ద్వారా తండ్రి దేశబోయిన వెంకన్నని పోలీస్ స్టేషన్ కు పిలిపించి విచారించగా మా కుమారుడే గత తొమ్మిది సంవత్సరాలుగా మతిస్థిమితం కోల్పోయి వెళ్లిపోయినాడని చెప్పినారు.ఇతనికి గతంలో నార్కెట్ పల్లి హాస్పటల్లో చికిత్స చేయించగా అక్కడనుండి పారిపోయినాడని తెలిపారు .పోలీస్ స్టేషన్ దగ్గరలోనే




పోలీసుల ముందు తండ్రి ముందు తన వెంట్రుకలన్నీ తొలగించి శుభ్రపరచిన అన్నం ఫౌండేషన్ వేరే దుస్తులు తొడిగించి పోలీసుల సమక్షంలో కుమారుడిని తండ్రి దేశ బోయిన వెంకన్నకు అప్పగించిన ఖమ్మం నగరానికి చెందిన అన్నం ఫౌండేషన్ వారు అప్పగించారు.ఈ సందర్భంగా పోలీసులు తండ్రి దేశబోయిన వెంకన్న తప్పిపోయిన మా కుమారుడిని చేరదీసి బాగు చేసి అప్పగించినందుకు అన్నం ఫౌండేషన్ సేవలను కొనియాడుతూ కృతజ్ఞతలు తెలియపరిచారు

# పువ్వాళ్ళ ఆశీర్వాదం తీసుకున్న గొల్లపూడి సర్పంచ్ మేడూరు రామారావు



వైరా రూరల్(సూర్య న్యూస్ ):-

ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మండల పరిధిలోని గొల్లపూడి పంచాయతీ సర్పంచిగా భారీ మెజారిటీతో గెలిచిన మేడూరు రామారావు మంగళవారం కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ సందర్భంగా పువ్వాళ్ళ మేడూరు రామారావుని అభినందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం సర్పంచ్ మేడూరు రామారావు స్థానిక గొల్లపూడి ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మిట్టపల్లి సతీష్, ముల్లపాటి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

# నూతన పాలకవర్గాలతో ఆత్మీయ సమ్మేళనం



ముదిగొండ, సూర్య మేజర్ న్యూస్:-

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నూతనంగా గెలుపొందిన పాలకవర్గాల సభ్యులతో మధిర నియోజకవర్గ పరిధిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొని నూతన పాలకవర్గాలను అభినందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు కూడా పాల్గొన్నారు. మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాలతో పాటు ముదిగొండ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామాల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# టీడబ్ల్యూజేఎఫ్ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

- 20న మహాసభల విజయవంతానికి యూనియన్ నేతల పిలుపు

ఖమ్మం (సూర్య బ్యూరో):



తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా మూడో మహాసభల పోస్టర్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు కలెక్టర్ ను మహాసభలకు ఆహ్వానించారు. కలెక్టర్ సుముఖత వ్యక్తం చేశారు. ఈనెల 20న ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్ లో నిర్వహించే ఖమ్మం జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాల్సిందిగా యూనియన్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అడ్ హక్ కమిటీ సభ్యులు సయ్యద్ ఖదీర్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం 9 గంటలకు మహాసభలు ప్రారంభమవుతాయని తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడేది టీడబ్ల్యూజేఎఫ్ మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ ఉపాధ్యక్షుడు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు దువ్వ సాగర్, కూరాకుల గోపి, ఆవుల శ్రీనివాస్, కొత్త యాకేష్, మానుకొండ రవి కిరణ్, పత్తి శ్రీను మధుశ్రీ, గణేష్, అర్షద్ తదితరులు ఉన్నారు.